J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 4 27.06.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## • ఆంధ్రాలో రాజకీయ వేడి...

# జగన్ అరెస్టు తప్పటడుగు అవుతుందా!



- పల్నాడు జిల్లా రెంటపాళ్ల ఘటనలపై కేసు నమోదు
- జగన్‌ను అరెస్టు చేస్తారంటూ ప్రచారం
- అరెస్టు చేస్తే ప్రభుత్వం అబాసుపాలవుతుందంటున్న విశ్లేషకులు

పల్నాడు వేదికగా ఆంధ్రాలో రాజకీయ వేడి పతాక స్థాయికి చేరింది. ఉప్పు - నిప్పులా ఉండే టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు తమ వాగ్బాణాలతో రాష్ట్ర రాజకీయ రంగస్థలంపై పోరును తారా స్థాయికి తీసుకెళ్తున్నారు. ఇన్నాళ్లూ అదిగో జగన్ అరెస్టు, ఇదిగో జగన్ అరెస్టు అంటూ ప్రచారం చేసిన కూటమి నేతలు ఈ మేరకు అవసరమైన పూర్వరంగాన్ని శరవేగంగా సిద్ధం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఏడాదికాలంగా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, కీలక నాయకులను టార్గెట్ చేసిన రెడ్‌బుక్ కార్యాచరణలో భాగంగా, ఇప్పుడు ఏకంగా కుంభస్థలాన్నే కొట్టేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

ఓ వైపు శాంతి భద్రతల సమస్య, మరోవైపు నిబంధనల ఉల్లంఘనలను కారణంగా చూపుతూ పల్నాడు జిల్లాలోని రెంటపాళ్లలో చోటు చేసుకున్న అపశ్రుతులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. రప్పారప్పా నరుకుతామంటూ ఇటీవల జగన్ పర్యటనలో ప్లకార్డులు ప్రదర్శించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు వంతపాడే తరహాలోనే ఆ పార్టీ అధినేత తీరు ఉందని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. ఇందుకు నిదర్శనమనేలా, ఓ కార్యకర్త తన కారుకింద చిక్కుకుని అల్లాడుతున్నా, చూసి కూడా వాహనం నిలుపకుండా జగన్ వెళ్లిపోయారని, ఆ తర్వాత కూడా ఆయన్ని పట్టించుకోలేదని టీడీపీ దుమ్మెత్తిపోస్తోంది. మరోవైపు హామీల అమల్లో చతికిలపడి ప్రజల్లో పలుచనైన కూటమి పార్టీలు , తప్పులను ఎత్తిచూపుతున్న తమ అధినేతను అక్రమ కేసులతో అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని, శాంతిభద్రతల పేరుతో కపట నాటకానికి తెరతీస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. అరెస్టులకు భయపడబోమంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు.

### ఎత్తుకు పైఎత్తులతో ముందుకు..

టిట్ ఫర్ టాట్ (ఎత్తుకు పైఎత్తు) ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాల్లో ప్రస్తుతం ఈ పదం జోరుగా

10లో



నేర్చుకోవాలనే జిజ్ఞాస, సాధించాలనే తపన ఉండాలే కానీ.. ప్రపంచాన్నే పాదాక్రాంతం చేసుకోవచ్చు. మొక్కవోని దీక్షతో గెలుపుకోసం చేసే యుద్ధంలో నీ ఆశే నీకు అస్త్రం.. నీ శ్వాసే నీకు శస్త్రం అవుతుందంటారు పెద్దలు. దీన్ని అక్షరాలా చేసి చూపిస్తున్నారు. ది గ్రేట్ ఎలెన్‌మస్క్. తన ప్రతిభకు వ్యాపార సూత్రాలను జోడించి బహుళ రంగాల్లో నమ్మశక్యంకాని విజయాలతో ఆయన దూసుకెళ్తున్నారు. ఏ పని ప్రారంభించినా.. ఏ విషయంలో అయినా తనకు ఎదురేలేదన్న తరహాలో విజృంభిస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రస్తుతం ప్రపంచంలో ఎలన్‌మస్క్‌కు ఎదురు నిలిచే వ్యాపారవేత్త.. ఆవిష్కర్త లేరంటే అతిశయోక్తి కాదమో. జూన్ 28 ఎలెన్‌మస్క్ జన్మదినం సందర్భంగా ఆయన అప్రతిహత విజయాలు.. అసమాన పోరాటాలపై ప్రత్యేక కథనం..




## • కనిపించే కీర్తి శిఖరం

# ఎలెన్ మస్క్.. ఓ ధ్రువతార

విశ్వాంతరాళాన్ని శోధించడంలో అమెరికా అంతరిక్ష పరిశోధనా కేంద్రం నాసాకు తిరుగులేదనే పేరుంది. అంతటి మహాశక్తివంతమైన సంస్థే అంతరిక్షంలో చిక్కుకుపోయిన వ్యోమగాములను రక్షించే క్రమంలో ఓ ప్రైవేటు కంపెనీ అధినేత సాయం కోరిందంటే.. ప్రపంచ పెద్దన్నగా చెలామణి అవుతున్న యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓ వ్యాపారవేత్త కీ ఫ్యాక్టర్‌గా మారితే.. మూడేళ్లుగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఓ సంస్థ అందించే సాంకేతిక సాయం నిలిపివేస్తే గంటల్లోనే ముగిసిపోతుందంటే.. ఆ సంస్థ ఎంతటి శక్తివంతమైనది కావాలి. ఆ సంస్థను నడిపే నాయకుడు ఎంతటి ప్రజ్ఞావంతుడు అయ్యుండాలి. దీనికి ప్రత్యక్ష ఉదాహరణే ఎలన్‌మస్క్. తన సామదానభేద దండోపాయాలతో యావత్ ప్రపంచ ప్రజానీకాన్ని ఆయన మంత్రముగ్ధులను చేస్తున్నారు. అందుకే ఈ మిరాకిల్ మెన్ నేటి యువతానికి ఓ రోల్‌మోడల్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. అడుగుకో రికార్డు నెలకొల్పుతూ.. అంతులేని సంపద సృష్టికర్తగా.. నయా పొలిటికల్ స్టార్‌గా.. రాకెట్లకే ప్రాణంపోసే ఇంజినీర్‌గా.. ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్)కే కొత్త పాఠాలు నేర్పే బిజినెస్‌మెన్‌గా ఆయన ప్రయాణం అపురూపం.. ఆయన ఆలోచనలు అనంతం. అందుకే ఆయన మోస్ట్ సక్సెస్‌ఫుల్ మెన్ ఇన్ హిస్టరీ అనే స్థాయికి చేరుకుంటున్నారు.

### ఆటుపోట్లతో ప్రారంభించి అందనంత ఎత్తుకు..

1971 జూన్ 28న దక్షిణాఫ్రికాలోని ప్రిటోరియాలో ఎలన్ మస్క్ జన్మించారు. ఈయన తండ్రి ఎర్రల్ ఓ ఇంజినీర్. ఈయన తల్లి మే ఓ కెనడియన్ మోడల్. మస్క్ చిన్నప్పటి నుంచి పుస్తకాల పురుగు. బయటవారితో పెద్దగా కలవడు. ఎలా ప్రవర్తించాలో కూడా తెలిసేది కాదు. దీంతో ఎలెన్ మస్క్ బలహీనతను చేతకాని తనంగా భావించే సహచర విద్యార్థులు తరచూ తూలనాడేవారు. ఏడిపించేవారు. కొన్నిసార్లు దాడులు కూడా చేసేవారు. ఇక ఎలెన్ మస్క్‌కు తొమ్మిదేళ్ల వయసున్నప్పుడు అతడి తల్లిదండ్రులు విడిపోయారు. తర్వాత కొద్దిరోజులు తండ్రి వద్దనే ఉండేవారు. తన నిర్ణయం సరైనది కాదని గ్రహించి తండ్రితో తెగదెంపులు చేసుకున్నాడు. కేవలం 12 ఏళ్లప్రాయంలోనే బ్లాస్టర్ అనే వీడియో గేమ్‌ను తయారు చేశాడు. పీసీ అండ్ ఆఫీస్ టెక్నాలజీ అనే పత్రిక దీన్ని 500 డాలర్లకు కొనుగులు చేసింది. తర్వాత 17 ఏళ్ల వయస్సులో దక్షిణాఫ్రికా నుంచి కెనడా వెళ్లిపోయాడు. అక్కడ కింగ్‌స్టన్ క్వీన్ యూనివర్సిటీలో, అమెరికాలోని పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్రంలో డిగ్రీ పొందాడు. వార్డెన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుంచి ఎకనామిక్స్‌లో సర్టిఫికెట్ పొందారు. తర్వాత వ్యాపార రంగంవైపు అడుగులేశారు.

### అంచెలంచెలుగా.. ఎదిగి..

1995లో తన సోదరుడు కింబల్‌తో కలిసి జిప్ అనే వెబ్ సాఫ్ట్‌వేర్ కంపెనీని 28 వేల డాలర్లతో ప్రారంభించారు. న్యూస్‌పేపర్లు, ఆన్‌లైన్ సీటీ గైడ్లను అభివృద్ధి చేసుకోవడంలో ఇది సాయమందిస్తుంది. తర్వాత దీన్ని 37 మిలియన్ డాలర్లకు అమ్మేశారు. తన భాగంగా 22 మిలియన్ డాలర్లను పొంది చిన్నవయసులోనే అతిభారీ విజయాన్ని సాధించారు. తర్వాత 10 మిలియన్ డాలర్లతో ఎన్స్‌కామ్ అనే బ్యాంకింగ్ సర్వీస్ సంస్థను ప్రారంభించి తర్వాత దాన్ని పేపాల్ అనే సంస్థకు విక్రయించారు. దాని సీఈఓగా మారి అత్యధిక వాటాలు అందుకున్నారు. చివరికి పేపాల్‌ను ఈ-బే అనే సంస్థకు అమ్మేశారు. అందులో తన షేర్ల ద్వారా ఏకంగా 165 మిలియన్ డాలర్లు పొందారు.

### అంగారకుడిపై పరిశోధనలకు గాను..

పేపాల్ విక్రయానికి ముందు 2001లో మార్స్ ఓయాసిస్ అనే ప్రాజెక్టుకు ప్రాణం పోశాడు. అంగారకుడిపై మానవ జీవనాన్ని సుసాధ్యం చేయడానికి అవసరమైన గ్రీన్‌హౌస్ నిర్మాణానికి ఉద్దేశించిన ప్రాజెక్టు ఇది. ఇందుకోసం అంగారకుడిపైకి వెళ్లేందుకు రాకెట్ల కొనుగోలు కోసం ఎలన్‌మస్క్ రష్యాకు వెళ్లారు. అక్కడ రాకెట్ల కొనుగోలు కోసం పెద్దమొత్తం వెచ్చించాల్సి రావడం, ఈ డీల్ సమయంలో రష్యన్లు రాకెట్లు అంటే అమెరికా బిస్కెట్లని అనుకున్నావా అంటూ హేళన చేయడంతో.. సొంతంగా తయారు చేసుకుంటానంటూ అమెరికాకు వెనక్కి వచ్చేశాడు. కొన్ని పరిశోధనల ద్వారా రాకెట్ కొనుగోలు ధరలో కేవలం 3 శాతం ముడిపదార్థాల కోసం వెచ్చిస్తే రాకెట్ సొంతంగా తయారు చేసుకోవచ్చని గుర్తించి ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించాడు.

### స్పేస్‌ఎక్స్, టెస్లా, సోలార్ సిటీతో చరిత్ర సృష్టించి..

తనకున్న పరిచయాలతో, తన ప్రాజెక్టు నమూనాలను వివరించి ఎలన్‌మస్క్ భారీగా పెట్టుబడులను ఆకర్షించారు. ఈ క్రమంలోనే తర్వాత 100 మిలియన్లతో స్పేస్‌ఎక్స్‌ను 2002 మే నెలలో ప్రారంభించాడు. మరుసటి సంవత్సరమైన 2003లో టెస్లా పేరుతో ఎలక్ట్రిక్ కార్ల ఉత్పత్తిని ప్రారంభించారు. అయితే 2006 తొలి స్పేస్ ఎక్స్ రాకెట్ ప్రయోగంతో పాటూ 2007, 2008లో చేపట్టిన అంతరిక్ష ప్రయోగాలు కూడా విఫలం కావడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. తర్వాత అమెరికా ఆర్థిక మాంద్యంలో కొట్టుమిట్టాడుతున్నా.. తన సర్వస్వం వెచ్చించి 2008లో స్పేస్ ఎక్స్ నుంచి పాల్కన్-1 రాకెట్‌ను భూకక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టి అద్భుత విజయం సాధించారు. వెంటనే టెస్లా నుంచి రోడ్‌స్టర్ కారును విజయవంతంగా లాంచ్‌చేసి ఎవరికీ అందనంత ఎత్తుకు ఎదిగిపోయారు. ఇక స్పేస్ ఎక్స్ తరపున నాసాతో 1.6 బిలియన్ డాలర్లతో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి అవసరయ్యే సామాగ్రిని తరలించే డీల్ కుదుర్చుకుని చరిత్ర సృష్టించారు. అలాగే రోడ్‌స్టర్ కార్ల ఉత్పత్తిని అమాంతం పెంచడం కోసం తన బంధువుల కంపెనీ అయిన సోలార్ సిటీని కొనుగోలు చేసి సౌరశక్తితో భారీగా విద్యుత్ ఉత్పత్తి చేయడమే కాకుండా తమ కారు వినియోగదారులకు ఫ్రీగా కారు చార్జింగ్ చేయిస్తామంటూ ప్రకటించి సంచలనం సృష్టించారు. ఇక అదే సమయంలో ప్రజలకు ఉచితంగా సౌర విద్యుత్ పరికరాలు అందజేసి తద్వారా వచ్చే విద్యుత్‌ను తానే కొనుగోలు చేసేలా 20 ఏళ్లకు ఒప్పందం కుదుర్చుకుని లక్షలాది మంది అమెరికన్లను ఇందులో భాగస్వామ్యం చేశారు. ఈ సోలార్‌సిటీ ప్రాజెక్టు స్ఫూర్తితోనే ప్రధాని నరేంద్ర మోదీ సూర్యఘర్‌గా పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి ఇంటిలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తుండడం గమనార్హం.

### పునర్వినియోగ రాకెట్‌తో సంచలనం..

ఇక స్పేస్ ఎక్స్ ద్వారా అనేక ప్రయోగాలు చేసి 2015 డిసెంబర్ 22న పునర్వినియోగానికి అవకాశం ఉన్న రాకెట్‌ను తయారు చేసి దాన్ని తొలుత లాంచింగ్ ప్యాడ్ నుంచి భూకక్ష్యలోకి చేర్చి.. తర్వాత అక్కడి నుంచి వెనక్కి వచ్చి లాంచింగ్ ప్యాడ్ వద్దకు విజయవంతంగా చేర్చారు. దీంతో మానవ చరిత్రలోనే తొలిసారి గొప్ప అంతరిక్ష విజయాన్ని సాధించారు. తద్వారా ప్రైవేటు రంగంలో అతిపెద్ద రాకెట్ ఇంజన్ల తయారీ సంస్థగా స్పేస్‌ఎక్స్ నిలిచింది. ఇదే సమయంలో వ్యాపారుల సరుకు రవాణా కోసం హైస్పీడ్‌తో కూడిన హైపర్ లూప్ వ్యవస్థను తీసుకొచ్చి తిరుగులేని విజయం సాధించారు. ఈ హైపర్‌లూప్ ద్వారా రైలును అత్యంత వేగంగా నడిపే విధానంపై ప్రస్తుతం మనదేశంలో ఐఐటీ మద్రాసు పరిశోధనలు చేస్తోంది. ఇక డిజిటల్ ఇంటిలిజెన్స్‌ను అభివృద్ధి చేసేందు కోసం మరికొందరితో కలిసి ఎలెన్‌మస్క్ ఓపెన్ ఏఐను నెలకొల్పారు. ఇది చాట్‌జీపీటీ అనే లాంగ్వేజ్ మోడల్‌ను అభివృద్ధి చేసి చరిత్ర సృష్టించింది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్)ను అభివృద్ధి చేసే ప్రయోగాలను ప్రారంభించాయి. ఇక రష్యా ఉక్రెయిన్ యుద్ధంలో ఉక్రెయిన్ దళాలు.. రష్యా సేనల కదలికలను గుర్తించడం కోసం (ఎలెన్‌మస్క్ కంపెనీ సాయంతో) ఏఐను వినియోగిస్తుండడం గమనార్హం. ఇక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో చిక్కుకున్న వ్యోమగాములు సునీత విలియమ్స్, బుచ్ విల్మోర్‌లను భూమిపైకి సురక్షితంగా తీసుకురావడంలో నాసాకు స్పేస్‌ఎక్స్ ద్వారా సాయం అందించడం అత్యంత అరుదైన, గొప్ప విషయంగా విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

### అనుకున్నది సాధించే తత్వంతోనే..

ఇక రంగంతో సంబంధం లేకుండా భవిష్యత్ తరాల అవసరాలను అంచనా వేయడం ఎలెన్‌మస్క్‌కు ఉండే ప్రత్యేక లక్షణం. ఇదే ఆయన్ని ఇతర వ్యాపార దిగ్గజాలతో పోల్చితే ముందుండేలా చేస్తోంది. పట్టుబట్టి సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) కోనుగోలు అయినా.. ఏఐకి రూపకల్పన చేయడమైనా.. క్రిప్టో కరెన్సీకి భవిష్యత్‌లో డిమాండ్ పెరుగుతుందని చెప్పడమైనా.. న్యూరోలింక్ ద్వారా కృత్రిమ మెదడుకు సంబంధించిన చిప్‌కు నాంది పలకడమైనా ఆయనకే చెల్లింది. అదే సమయంలో స్టార్‌షిప్ ప్రాజెక్టు ద్వారా ప్రపంచంలో ఏ దేశానికైనా అమెరికా నుంచి గంట సమయంలోపే చేరుకునేలా రాకెట్ ద్వారా ప్రయాణికులను చేరవేసేందుకు కూడా తీవ్రమైన ప్రయత్నాలు చేస్తుండడం గమనార్హం. ఇది కనుక పూర్తయితే ప్రపంచ విమానయాన రంగాన్ని ఎలన్‌మస్క్ శాసించడం ఖాయమనే ప్రచారం సాగుతోంది. ఇక ఏదో ఒక రంగంలో రాణించడమే గొప్పదైనా నేటి కాలంలో బహుళరంగాల్లో ఆకాశమంత ఎత్తుకు ఎదగడం ఎలన్‌మస్క్‌కే సాధ్యమైంది. తన ఆవిష్కరణలు, వ్యాపార సూత్రాలతో చరిత్రలో ఎలన్‌మస్క్ కీర్తి ఆజరామరంగా ఉంటుందదనంలో ఎలాంటి సందేహం లేదు. అందుకే ఆయన ఓ ధ్రువతార అనడం సమంజసం. సహేతుకం.

- బాలుబాబు

# రొట్టెల పండుగకు ముమ్మరంగా ఏర్పాట్లు

## జులై 6 నుంచి.. నెల్లూరులో భక్తజన కోలాహలం



మతసామరస్యానికి ప్రతీకగా నిలిచి, ప్రపంచస్థాయిలో పేరెన్నికగన్న నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగ వేడుకలు దగ్గరపడుతుండడంతో దర్గా ప్రాంతాన్నంతా శోభాయమానం చేస్తున్నారు. 'రాష్ట్ర పండుగ'గా కూడా పేరుగాంచిన బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ జులై 6 నుంచి ప్రారంభం కానుంది. 7వ తేదీ రాత్రి అత్యంత వైభవంగా గంధ మహోత్సవం జరుగనుంది. 8వ తేదీ వేకువ నుంచే దర్గాచెంతనే ఉన్న స్వర్ణాల చెరువులో రొట్టెల పండుగ ప్రారంభం అవుతుంది. ఈనెల 10వతేదీ వరకు.. అయిదురోజుల పాటు అత్యంత వైభవంగా జరిగే ఈ వేడుకలకు జిల్లా అధికార యంత్రాంగం, కార్పొరేషన్ అధికారులు, దర్గా నిర్వాహకులు భారీఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితర ప్రముఖులంతా ఈ వేడుకలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నారు. అధికారులు, దర్గా నిర్వాహకులతో పాటు, అబ్దుల్ అజీజ్ ఎప్పటికప్పుడు దర్గా వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సుమారు 3 కోట్ల రూపాయల వ్యయంతో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. దర్గా ముందు చలువ పందిర్లు వేస్తున్నారు. మినార్లకు అందంగా రంగులు దిద్దుతున్నారు. దర్గా ప్రాంగణాన్నంతా రంగురంగుల విద్యుద్దీపాలతో దేదీప్యమానం చేస్తున్నారు. స్వర్ణాల చెరువు ఘాట్‌లో ఉన్న గుర్రపుడెక్కనంతా తొలగించి పరిశుభ్రం చేస్తున్నారు. ఈసారి శుద్ధిచేసిన జలాన్ని భక్తులకు అందించాలని కృషి చేస్తున్నారు. ఈనెల 25న ఆ ఏర్పాట్లకు సంబంధించి నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.నందన్ అధికారులతో సమీక్షించారు. పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. భక్తుల భద్రతకు నిఘా కెమెరాలు సిద్ధం చేస్తున్నారు. ప్రపంచ నలుమూలల నుండి లక్షల సంఖ్యలో భక్తులు పాల్గొనే ఈ వేడుకల్లో ఎక్కడా ఎలాంటి లోపాలు తలెత్తకుండా ఏర్పాట్లు చేసేందుకు అధికారగణమంతా తలమునకలై ఉంది.



## ఎన్‌బికెఆర్‌లో ఎన్‌సిసి శిక్షణా తరగతులు

ఎన్‌సిసి క్యాడెట్లు జాతీయ సమైక్యత కోసం పాటుపడాలని ఎన్‌సిసి గుంటూరు గ్రూప్ హెడ్‌క్వార్టర్స్ పరిధిలోని 10-ఆంధ్ర నావెల్ యూనిట్ ఎన్‌సిసి నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొదంగవే పిలుపునిచ్చారు. కోటమండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గత ఆరు రోజులుగా నిర్వహిస్తున్న 9వ ఎన్‌సిసి నావెల్ వార్షిక శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈనెల 29వ తేదీ వరకు ఈ శిబిరం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సిసి క్యాడెట్లు సమాజం పట్ల అవగాహనతో ఉండాలన్నారు. సామాజిక సేవ, దేశభక్తి, క్రమశిక్షణ, సేవా నిరతిలను అలవరచుకుని దేశసమైక్యత ధ్యేయంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ క్యాంపులో వివిధ కళాశాలల ఉన్నత పాఠశాలలకు చెందిన కేడెట్లకు ఏ-బీ-సీ సర్టిఫికెట్లు సాధించేందుకు ఈ శిక్షణ శిబిరం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిబిరంలో క్యాడెట్లలో శారీరక మానసిక-ఆరోగ్యం పెంపొందించడానికి భౌతిక శిక్షణ, యోగా నిర్వహించడం, భవిష్యత్‌లో సైన్యంలో చేరేలా పెరేడ్ ట్రైనింగ్, ఫైరింగ్, బోట్ వర్క్, రిగ్గింగ్, నేవల్ ఓరియంటేషన్, యాంకర్ వర్క్, షిప్ మోడలింగ్, లీడర్ షిప్, సీమాఫోర్, బోట్ పుల్లింగ్ తదితర అంశాలపై శిక్షణ నిచ్చారు. సీనియర్ డివిజన్, సీనియర్ వింగ్ క్యాడెట్లకు ఇంటర్ గ్రూప్ కాంపిటేషన్ (ఐజిసి), నవసైనిక్ క్యాంపులకు ఎంపికయ్యే విధంగా ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరిగింది. అనంతరం క్యాడెట్లకు గేమ్స్ అండ్ స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణా శిబిరంలో ఎన్‌సీసీ ఆఫీసర్లు సీవీ నాగరాజు, మల్లికార్జునరెడ్డి, పెంచలయ్య, గోవిందు, లక్ష్మీనారాయణ, ప్రసాద్, పీఐ స్టాఫ్ వైకుంఠం, ఈశ్వర్‌రావు, రంజన్, షిప్ మోడలింగ్ ఇన్‌స్ట్రక్టర్ రామన్, ఎన్‌సిసి సూపరింటెండెంట్ ముకుందసాగర్ పాల్గొన్నారు.

## చంద్రు పుట్టినరోజున రక్తదానం



తన పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 26న నెల్లూరు వైకాపా కార్యాలయంలో రక్తదానం చేస్తున్న వైకాపా నాయకులు, కార్యకర్తలు, తన అభిమానులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

## ఘనంగా ద్వాదశారాధన



నెల్లూరు వేదాయపాళెంలోని శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంలో కొలువై ఉన్న శ్రీ గురువాయూర్ మహావిష్ణుస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 22వ తేదీ రాత్రి ఘనంగా ముగిశాయి. పాంచరాత్ర ఆగమానుసారం ఆదివారం ఉదయం నిత్యహోమాలు, హయగ్రీవ హోమం, శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ గురువాయూర్ మహావిష్ణుస్వామి వారికి చక్రతాళ్వార్ స్వామివారికి నవ కలశ స్నపన తిరుమంజనం, తదుపరి దేవస్థాన కోనేరులో చక్రస్నానం వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం మహా పూర్ణాహుతి, కలిశోద్వాసన, కుంభ ప్రోక్షణ, ధ్వజావరోహణం, ద్వాదశారాధన, శ్రీ పుష్పయాగంలతో ఈ బ్రహ్మోత్సవాలు పూర్తయ్యాయి. ఆలయ ఛైర్మెన్ గూడల శేషగిరిరావు కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, ఉపాధ్యక్షులు పి.టి.జగన్నాథం, కోశాధికారి గడ్డం రత్నయ్యల పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## ఆప్యాయ పలకరింపు

ఈ నెల 26వ తేదీ గురువారం ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో స్పీకర్ కార్యాలయానికి వెళ్లిన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి స్పీకర్ ఓం బిర్లాని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఇరువురు పలు అంశాలపై చర్చించుకున్నారు.

## రామతీర్థాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం


### కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



కోవూరు నియోజకవర్గం, విడవలూరు మండలం రామతీర్థంలో గ్రామంలో.. సముద్రతీరంలో కొలువైవున్న పురాతనమైన శ్రీ రామలింగేశ్వరస్వామి క్షేత్రాన్ని, రామతీర్థాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఇటీవల రామతీర్థంలో ఎంతో వైభవంగా జరిగిన శ్రీ రామలింగేశ్వరస్వామి కళ్యాణోత్సవంలో ఆమె పాల్గొని సార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేకపూజలు చేశారు. శివపార్వతుల కళ్యాణోత్సవం సందర్భంగా స్వామి-అమ్మవార్లకు ఆమె చీర సారే సమర్పించారు. అనంతరం కన్నుల పండువగా సాగిన శివపార్వతుల కళ్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆలయాలు మన సంస్కృతి వైభవాన్ని చాటుతాయన్నారు. ఇక్కడ వెలసివున్న శ్రీ కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో పాల్గొనడం తన అదృష్టమన్నారు. తొలుత ఆమెకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రామతీర్థంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. సరిగ్గా ఏడాది క్రితం రామతీర్థం నుంచి తన ఎన్నికల ప్రచారం ప్రారంభించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. పార్వతీ పరమేశ్వరుల ఆశీస్సులతో రామతీర్థం ప్రాంతంతో పాటు కోవూరు నియోజకవర్గం పరిశ్రమలు, పాడి పంటలతో సుభిక్షంగా వుండాలని ఆమె ఆకాంక్షించారు. ఆలయ చైర్మన్ సురేష్, విడవలూరు మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## మహనీయుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ

### --- బీజేపీ నాయకుల నివాళి ---



జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలు అపారమని పలువురు బీజేపీ నాయకులు కొనియాడారు. జూన్ 23న ఆయన వర్ధంతి సందర్భంగా ఆత్మకూరులో జరిగిన కార్యక్రమంలో నాయకులు ఆయన్ను స్మరించుకున్నారు. ఆ మహనీయుడు తన ప్రాణాలను దేశ ఐక్యత కోసం అర్పించారంటూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, పట్టణ బీజేపీ అధ్యక్షుడు నున్నా సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లాయర్
జూన్ 27, 2025

# మాదకద్రవ్యాల మత్తులో.. యువత!

డ్రగ్స్! డ్రగ్స్! డ్రగ్స్!..ఒకప్పుడు ఎప్పుడో వినపడే మాట. ఇప్పుడు తరచూ వినపడుతోంది. మాదకద్రవ్యాలు...లేదా మత్తుపదార్థాలు.. పేరేదైనా ఇవి ప్రజల జీవితాలను తమ మత్తుతో చిత్తు చేస్తున్నాయి. ఎక్కడ చూసినా నల్లమందు మాఫియాలు, గంజాయి బ్యాచ్‌లు ఎక్కువవుతున్నాయి. ఫలితంగా నేరాలు, ఘోరాలు కూడా పెరిగిపోతున్నాయి. మాదకద్రవ్యాలను వినియోగిస్తున్నవారి సంఖ్య లక్షల్లో కాదు, ఇప్పుడు కోట్లల్లోకి చేరుతోంది. ముఖ్యంగా విద్యార్థులు, యువత వీటికి ఆకర్షితులై తమ భవితను, చివరికి జీవితాలను కూడా సర్వనాశనం చేసుకుంటున్నారు. మత్తుపదార్థాలను పీల్చడం, తాగడం, లేదా సిరంజీలు పెట్టి సూదులతో శరీరంలోకి మత్తును ఎక్కించుకోవడం వంటి వాటికి పాల్పడుతున్నారు. ప్రారంభంలో డ్రగ్స్ వాడడం సరదాగా మొదలై, అది అలవాటుగా, క్రమేణా వ్యసనంగా మారి, చివరికి ఆ మత్తు లేకుండా బతకలేమనే స్థితికి తెస్తుంది. బంధాలు, అనుబంధాలకు దూరమై, మత్తులోకంలో విహరిస్తూ చివరికి ఏం చేస్తున్నారో కూడా తెలియని దుర్గతిలో పడి పిచ్చివాళ్లయి పోతున్నారు. తెలిసీ తెలిసీ వాటికి బానిసలై..అనారోగ్యాల పాలై అర్థాంతరంగానే మరణిస్తున్నారు. ఆ మత్తులో కొంతమంది ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారు. మరికొందరు హత్యలు, మానభంగాల వంటి నేరాలకు ఘోరాలకు పాల్పడుతున్నారు. ఒక్క మనదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఈ జాడ్యం అంతకంతకు పెరుగుతూనే ఉండడం విచారకరం. గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా సమారు 20 కోట్ల మందికి పైగానే మాదకద్రవ్యాలను వినియోగించినట్లు గణాంకాలు చెప్తున్నాయి. ప్రతి 8 మందిలో ఒకరు వీటివల్ల అనారోగ్యంపాలై ఆసుపత్రుల్లో చేరినట్లు తెలియజేస్తున్నాయి. దీన్నిబట్టి వీటి వినియోగం ఎంతగా పెరిగిపోతోందో ఊహించుకోవచ్చు. మనదేశంలో కూడా ఈ మత్తుపదార్థాల వాడకం ఇటీవలి కాలంలో బాగా పెరుగుతూనే ఉందని, ఒక్క గంజాయి వాడకమే 25 శాతం పైగానే పెరిగిందని అంటున్నారు. జాతీయ మాదకద్రవ్య నిరోధక సంస్థ లెక్కల ప్రకారం, మనదేశంలో దాదాపు 10 కోట్ల మందికి పైగానే మాదకద్రవ్యాలను వాడుతున్నారని అంచనా. కోటీ 50 లక్షల మందికి పైగానే ప్రజలు నల్లమందుకు అలవాటు పడ్డారని, ఇతరత్రా మాదకద్రవ్యాలను కూడా పెద్దఎత్తునే వినియోగిస్తున్నారని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్, బీహార్, కేరళ, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాలు వీటి వాడకంలో మరింత అధికస్థాయిలో ఉన్నాయి. నిషేధించిన ఈ మత్తుపదార్థాలను అమ్మడం, కొనడం, వాటిని ఏ విధంగానైనా సరే.. కలిగి ఉండడం నేరమని తెలిసినా మాఫియాల వారు లెక్కచేయడం లేదు. చాపకింద నీరులా ఈ వ్యాపారం నిరాఘాటంగానే సాగిపోతూనే ఉంది. రకరకాల ప్యాకెట్లు, పొడుల రూపంలో పాఠశాలలు, కళాశాలలున్న ప్రాంతాల్లో వాటిని చాటుమాటుగా అమ్ముతూ వాటిని విద్యార్థిలోకానికి అంటగడుతూనే ఉన్నారు. అనేకచోట్ల వీటిని అధికారులు పట్టుకుంటున్నా, పూర్తిస్థాయిలో అరికట్టలేకపోతున్నారు. పట్టణాలు, నగరాల్లోనే కాదు చివరికి గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా వీటికి అలవాటుపడిపోతున్నారు. ప్రపంచానికే ఒక ముప్పులా తయారైన ఈ డ్రగ్స్‌ని నిరోధించేందుకు ప్రజలు తగిన అవగాహనతో ఉండాలని 1987లోనే ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా జూన్ 26వ తేదీని 'ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం'గా ప్రకటించింది. మాదకద్రవ్యాల మత్తు జీవితాలను చిత్తుచేస్తుందని, ప్రతి ఒక్కరూ వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలంటూ పిలుపునిచ్చింది. ఈ నేపధ్యంలో ప్రజలు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి. మాదకద్రవ్యాల మాఫియాలను కఠినంగా అణచివేసేందుకు ప్రభుత్వాలు మరింత పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికలను అమలుచేయాలి. అవి ఎక్కడ పుడుతున్నాయో, ఎలా రవాణా అవుతున్నాయో.. ఎవరికి చేరుతున్నాయో ఆమూలాగ్రం ప్రభుత్వాలు నిఘాబృందాలతో పరిశీలించి, వాటిని పూర్తిస్థాయిలో నివారించేందుకు చర్యలు తీసుకోవాలి. దేశానికే ఆయువు పట్టైన యువత.. మత్తులో జోగకుండా ఉండేందుకు తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు చిన్నతనం నుంచే నైతిక విద్యను బోధించాలి. ఎలాంటి దుష్ప్రవర్తనలకు, దురలవాట్లకు పిల్లలు చేరువ కాకుండా, ఎప్పటికప్పుడు వారి ప్రవర్తనను గమనిస్తుండాలి. వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దుకోవాలి. ప్రాణాలు తీసే అలాంటి ప్రమాదకరమైన మాదకద్రవ్యాల జోలికి వెళ్ళకుండా అందరూ ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడే 'ప్రపంచ మాదకద్రవ్యాల దినం' వంటివాటికి కూడా సార్థకత ఉంటుంది.

# సత్యపీఠం
నిజాలే మాట్లాడుకుందాం! 96

# నకిలీలతో రైతన్నల ఇక్కట్లు!

"నమ్మి నానబోసుకుంటే.. పుచ్చి బుర్రలవుతాయి" అన్నది సామెత. ఒకచోటని కాదు.. దేశంలో ఇప్పుడు అనేక రాష్ట్రాల్లో రైతుల దుస్థితి ఇలాగే ఉంది. ఏరువాక ప్రారంభమై పంటలు వేసుకోవడానికి రైతులు సిద్ధమైనప్పుడల్లా అన్నిటికంటే ముందు అటు మార్కెట్‌ను ముంచెత్తేది, రైతును నిట్టనిలువునా ముంచేదీ నకిలీ విత్తనాలు, మందులే. అమాయక రైతులు పలానా విత్తనాలే మంచివని నమ్మి, వాటిని పొలాల్లో వేసి, అప్పోసప్పో చేసి తెచ్చుకున్న డబ్బునీ, రేయింబవళ్ల రెక్కల కష్టాన్నీ పెట్టుబడిగా పెట్టి, ఆ పంట పండితే అన్ని కష్టాలు తీరిపోతాయని కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూస్తుంటారు. అయితే, చివరికి ఆ విత్తనాలు మొలకలెత్తేదీ లేదు, పంట పండేదీ లేదు. దీంతో ఆ రైతు కుప్పకూలిపోయి, అప్పుల బాధల్లో కూరుకుపోయి, బతకలేక చావలేక నడిమధ్యలో కొట్టుమిట్టాడుతుంటాడు. దేశంలో అనేకమంది అక్రమ వ్యాపారుల దురన్యాయాలకు ఎంతోమంది రైతులు అనునిత్యం బలైపోతూనే ఉన్నారు. ముఖ్యంగా, అదేపనిగా అక్రమార్కులు కొందరు నకిలీ విత్తనాలను, మందులను అందమైన ప్యాకెట్లలో పెట్టి, అవే మంచివంటూ ప్రచారాం చేసి, నమ్మిన రైతుల్ని బురిడీ కొట్టించేస్తున్నారు. తద్వారా, పదిమందికీ అన్నంపెట్టే అన్నదాతల కడుపుకొడుతూ, వారిని అత్యంత దారుణంగా మోసం చేస్తూ, వాళ్ళు మాత్రం కోట్లకు కోట్లు కూడగట్టుకుంటున్నారు. రైతులోకంలో ఇప్పుడది పెద్ద నిర్వేదంగా తయారవుతోంది. ఎందరో రైతులు ఈ అక్రమాలు, అన్యాయాలను భరించలేక కాడె వదిలేస్తున్నారు.

## అన్నీ నకిలీవి.. లేదంటే కల్తీవి

దేశంలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 8 కోట్ల హెక్టార్లు, రబీలో మరో 6 కోట్ల హెక్టార్లకు పైగానే పంటలు సాగవుతూ ఉంటాయని అంచనా. నిద్ర మంచం లేచిందగ్గర నుంచి ఆరుగాలం కష్టించి స్వేదంతో సేద్యం చేస్తాడు రైతన్న. అరక దున్ని, విత్తనాలు వేస్తే, అవి మొలకెత్తకపోతే, ఆ సీజన్‌లో ఇక పంటే చేతికి రాకుంటే ఆ రైతు బతుకేం కావాలి?.. వాస్తవానికి విత్తనాల మార్కెట్ చిన్నదేమీ కాదు. లక్షల కోట్ల వ్యాపారం అది. కొంతమంది బడావ్యాపారులు చేసే మాయాజాలమిది. దీంతో, దేశంలో నాణ్యమైన విత్తనాలు, మందులు దొరకడం గగనమైపోయింది. చాలాచోట్ల నకిలీ విత్తనాలు, మందులే రకరకాల బ్రాండ్‌లతో, అవే మంచివన్నట్లుగా చలామణీ అయిపోతున్నాయి. ముఖ్యంగా వాణిజ్య పంటల సాగులో దాదాపు 60శాతం దాకా నాసిరకం లేదా కల్తీ విత్తనాలు, మందులే ఉంటున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఆ నకిలీ విత్తనాలను పొలాల్లో నాటి, ఎంత నీరు పట్టించినా అవి సరిగా ఎదగక, పూత రాక, కాపు లేక రైతులు దిగాలుపడిపోతున్నారు. ఇక వరిపంటలోనైతే ఈ నకిలీ మందులు, రసాయనాల వల్ల నారు కూడా చేతికందకుండా, చివరికి పంట పొలాల్లోనే ఎండిపోతుంటుంది. దేశవ్యాప్తంగా అనేకమంది మోసపు వ్యాపారులకు ఇదే పెద్ద వ్యాపారంగా మారింది. నకిలీ విత్తనాలని, మందులని అమాయక రైతులకు అమ్మేసి వాళ్ళను నిలువుదోపిడీ చేస్తున్నారు. రైతులు దిక్కుదివాణం లేకుండా పోతున్నారు. అధికారులు ఎన్ని రకాల చర్యలు తీసుకుంటున్నా, నకిలీల బెడద తగ్గడమే లేదు. ప్రభుత్వాలు గట్టిగా దృష్టిసారించకుంటే ఈ మోసాలు ఆగేలా లేవు.

## ఇంకా ఎంతకాలం ఈ మోసాలు?

అసలే ప్రకృతి ఎప్పుడు కరుణిస్తుందో తెలియదు. అదునుకు పదునైన వానలు లేకుంటే పంటలు పండడం కష్టం. పంటలు చేతికందేదాకా నమ్మకం లేదు. ఎప్పుడు వర్షాలు, తుఫాన్లు, వరదలు వచ్చినా, ఒకవేళ కరువే కాటేసినా, అన్నిటినీ భరాయించాల్సింది రైతన్నలే. బలైపోయేది అన్నదాతలే. ఒకవేళ అదృష్టం బాగుండి ఆ ఏడాదికి నాలుగు గింజలు పండినా, వాటికి మార్కెట్లో గిట్టుబాటు ధర ఉండదు. అత్యంత తక్కువ ధరకే పంటనంతా తెగనమ్ముకోవాలి. ఇలా అడుగడుగునా దగా పడుతున్న రైతన్నలను పంటల ప్రారంభదశలోనే నకిలీ విత్తనాలు, మందులు నట్టేట ముంచుతున్నాయి. ఏరువాక ప్రారంభం కాకముందు నుంచే ఇవి మార్కెట్లో సిద్ధంగా ఉంటున్నాయి. రకరకాల కంపెనీలు మాయమాటలతో రైతులకు నిత్యం కుచ్చుటోపీ పెట్టేస్తూనే వున్నాయి.

## అక్రమార్కుల భరతం పట్టాలి

మార్కెట్లో రైతులపై అక్రమార్కులదే పెత్తనమైపోయింది. దళారీలు, వ్యాపారులు కుమ్మక్కైపోయి అందరూ సిండికేట్‌గా మారి, రైతును నష్టాలపాలు చేస్తున్నారు. నకిలీ విత్తనాలు, మందులు, రసాయనాలతో మాయ చేస్తున్నారు. అన్నం పెట్టే అన్నదాతలనే దగా చేస్తున్నారు. నేడు ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఆకాశమంటుతున్నా, ఇంకా మన రైతులు నకిలీలతో బాధలు పడుతుండడం దారుణం. ఈ దుస్థితి పోవాలి?.. మంచి విత్తనాలను, మందులను , రసాయనాలను ప్రభుత్వాలే నిర్ధారించి రైతులకు పంపిణీ చేస్తే తప్ప ఈ అవస్థలు తీరేట్టు కనిపించడం లేదు. అందులోనూ వ్యవసాయ శాస్త్రవేత్తలకు మనదేశంలో కొదవలేదు. నాణ్యమైన వాటిని గుర్తించి ఎంపిక చేయడం పెద్ద కష్టమేమీ కాదు. ఇకనైనా ప్రభుత్వాలు కళ్ళు తెరవాలి. అన్ని రకాల పంటలకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు తదితర ముడి సరుకుల్ని ప్రభుత్వాలే రైతన్నలకు అందుబాటు ధరలతో పంపిణీ చేయాలి. అంతేకాదు, రైతులను దగా చేస్తూ, నకిలీ విత్తనాలను అంటగట్టి వారి జీవితాలను అథోగతి పాలుచేస్తున్న అక్రమార్కుల భరతంపట్టాలి. నకిలీలన్నవే మార్కెట్లోకి రాకుండా చూడడమే కాక, అలాంటి వాటిని ముందుగానే ఎలా కనిపెట్టాలన్న విషయంపైన రైతులకు అవగాహన కల్పించాలి. దేశానికి వెన్నెముకైన రైతులను ప్రభుత్వాలు కాపాడాలి...!

- రాజశ్రీ

# యోగాతో యోగం!

విశాఖపట్టణంలో లక్షలాది మంది చేత ఒకేరోజు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించడం అభినందనీయం. ప్రతిష్టాత్మకమైన ఇలాంటి కార్యక్రమం మన తెలుగు రాష్ట్రంలో జరగడం అద్భుతం. ఈ కార్యక్రమంలో సాక్షాత్తూ ప్రధానమంత్రి గారు ప్రధాన అతిథిగా పాల్గొనడం మహాద్భుతం. యోగా కార్యక్రమానికి ప్రధానమంత్రి రావడం ఆంధ్రాకి ఆరోగ్యయోగం పట్టినట్లుగా అనిపించింది. ఆంధ్రాలో యోగాకి విస్తృత ప్రచారం లభించినట్లయ్యింది. విశాఖతో పాటు అన్ని జిల్లా, మండల కేంద్రాలలో సైతం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో యోగోత్సవాలని ఘనంగా జరపడం యోగ పట్ల, ఆరోగ్య ఆంధ్రా పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం. చేపట్టిన ఏ కార్యక్రమాన్నయినా చిత్తశుద్ధితో, అంకితభావంతో ప్రజలకి ప్రయోజనకరంగా చేస్తున్న కూటమి ప్రభుత్వానికి నా అభినందనలు.

- పచ్చా పెంచలనాయుడు, పొదలకూరు.

# ఘోరాతి ఘోరం.. అమానవీయం!

వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి రెంటపాళ్ళ పర్యటనలో ఓ అమాయకుడు బలైపోయిన వార్త చూస్తుంటే మనసు చలించిపోతోంది. అదీ సాక్షాత్తూ అధినాయకుడి కారు చక్రాల క్రింద పడి ఓ అభాగ్యుడి బ్రతుకు ఛిద్రమైపోవడం అత్యంత అమానవీయంగా అనిపిస్తుంది. ప్రముఖుల పర్యటనలలో ప్రమాదాలు జరుగుతుండడం సర్వసాధారణం. అనేకమంది ప్రముఖుల కాన్వాయి ఢీకొని గతంలో కూడా అనేక ప్రాణాలు గాలిలో కలిసిపోయిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. కానీ రెంటపాళ్ళలో జరిగిన ఘటనలో సాక్షాత్తూ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటిస్తున్న కారు క్రిందే మనిషి పడిపోయి ఆయనపై నుండి కారువెళ్ళడం దారుణాతి దారుణం. సింగయ్య కారు క్రింద పడిన సమయంలో కారు వేగంగా కూడా వెళ్లడంలేదన్న విషయం ఆ సంఘటనకి సంబంధించిన వీడియోలలో స్పష్టంగా తెలుస్తోంది. కేవలం జగన్‌ని చుట్టుముడుతుండిన జనాన్ని తప్పించుకుని వెళ్లిపోవాలనే క్రమంలోనే ఈ ప్రమాదం జరిగినట్లుగా అనిపిస్తోంది. ఏదిఏమైనా వందలాదిమంది జనం ప్రత్యక్షంగా చూస్తుండగానే ఒక నిండు ప్రాణం బలికావడం ఘోరాతి ఘోరం, అత్యంత బాధాకరం.

- లక్ష్మీ భరద్వాజ్, హైదరాబాదు.

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

# అవును... అవి వారంటీ లేని గ్యారంటీలే!

కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలని ఆలస్యంగానైనా ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తున్నారు. గత వారం మన 'లాయర్'లో పేర్కొన్నట్లుగా అవన్నీ వారంటీ లేని గ్యారంటీలే. ఈ పథకాలన్నీ సమర్థవంతంగా, పరిపూర్ణంగా అమలు చేయాలంటే లక్షల కోట్లు కావాలి. కానీ, మన ఖజానాలో అంత సొమ్ము లేదు. ఆంధ్రా ఆర్థిక పరిస్థితికి అంత సీను లేదు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం నిధులతో ఆదుకున్నా ఆ సొమ్ములు కొంతమేరకే ఉపయోగపడతాయనడానికి సందేహం అవసరం లేదు. గత ప్రభుత్వ పుణ్యమా అంటూ గతి తప్పి దివాళా తీసిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మళ్ళీ గాడినపెట్టడం ఇప్పట్లో సాధ్యమయ్యే పనికాదు. చంద్రబాబునాయుడుకి "అల్లావుద్దీన్ అద్భుత దీపం" దొరికితే తప్ప.. చెప్పింది చెప్పినట్లు చేయడం అసాధ్యమే..!

యం. చంద్రమౌళి - కొత్త ఢిల్లీ.

# యోగాతో పరిపూర్ణ జీవనం

## - ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి





యోగాతో సంపూర్ణ ఆయురారోగ్యాలు సమకూరుతాయని, యోగా నిత్యజీవితంలో అందరికీ భాగం కావాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) చెప్పారు. జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా, నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని యోగాపై ప్రజలకు అవగాహన కల్పించారు. తొలుత, ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన యోగా సాధనలో పాల్గొని యోగాసనాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా ఈ ఏడాది వన్ ఎర్త్, వన్ హెల్త్ నినాదం మారుమోగుతోందన్నారు. ఈ ఏడాది యోగాకు రాష్ట్రంలో 2 కోట్ల మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, నెల్లూరు జిల్లాలో 11 లక్షల మంది రిజిస్టర్ చేసుకున్నారన్నారు. జిల్లాలో దాదాపు 7 వేల ప్రాంతాల్లో యోగా సాధన చేస్తుండటం గొప్ప విషయమన్నారు. యోగ వల్ల కొన్ని రకాల శారీరక రుగ్మతలను దూరం చేసుకోవచ్చని, తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచే పిల్లలకు యోగాసనాలు నేర్పించాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో మన యోగా బాగా ప్రాచుర్యం పొందిందని, ఇతర దేశాలు కూడా యోగ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయన్నారు. జిల్లాలో ఈ సందర్భంగా పెద్ద ఎత్తున యోగ కార్యక్రమాలు నిర్వహించిన జిల్లా యంత్రాంగాన్ని ఆయన అభినందించారు.నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నెల రోజులపాటు నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాలు రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచి పోతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌తో పాటు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ కార్తీక్, మున్సిపల్ కమిషనర్ నందన్, డిఆర్ఓ ఉదయ భాస్కర్, ఆయుష్ శాఖ అధికారి గోవిందప్ప, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి మోహన్‌రావు, రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావు, జిల్లా నోడల్ అధికారి ఆర్‌కె.యతిరాజు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఎవెన్యూ స్కూల్ విద్యార్థినులు సహస్ర, లయశ్రీ, జనన్యా తదితరులు నిర్వహించిన యోగ విన్యాసాలు అందరినీ అలరించాయి. అదేవిధంగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన అరుణ నిర్వహించిన ఏకపాద పద్మాసనం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం అధికారులు యోగా కోఆర్డినేటర్ ప్రసన్నకుమార్, శిక్షకులు సుకన్య, శైలజ, పద్మజ ,ప్రసూన, గాయత్రి, ప్రసన్న తదితరులను సన్మానించి మెమొంటోలు అందజేశారు.

### పాఠశాలల్లో రోజూ ఓ గంట పాటు

# యోగ సాధన చేయించాలి

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



అందరి జీవితాల్లో యోగా ఒక భాగం కావాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆకాంక్షించారు. జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కోవూరులో అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కోవూరులోని బాలికల పాఠశాలలో నిర్వహించిన యోగాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు మరియు వందలాదిగా ప్రజలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆమె వారందరితో పాటు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోడి ఆధ్వరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సారధ్యంలో విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించడం రాష్టానికి గర్వకారణమన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ప్రజలలో స్ఫూర్తిని నింపేందుకు వారు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విశాఖలో నిర్వహించారన్నారు. సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యమన్నారు. ప్రతి పాఠశాలలో రోజుకో గంట విద్యార్థినీ, విద్యార్థులకు యోగ శిక్షణా తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

# మానసిక, శారీరక ఆరోగ్యానికి.. యోగా!

## సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



యోగా.. మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందని సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన పొదలకూరు జిల్లా పరిషత్ స్కూలు మైదానంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారు. ఇక్కడ ఒకేచోట వెయ్యిమంది యోగ సాధన చేయడం విశేషమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో విశాఖలో చరిత్రలో నిలిచిపోయేలా యోగాంధ్ర కార్యక్రమం విజయవంతమైందని, అదొక ప్రపంచ రికార్డు అనీ కొనియాడారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసిన వారందరికీ ధన్యవాదాలన్నారు. యోగ సాధనను అందరూ తమ జీవితాల్లో భాగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి తనయుడు, కోడలు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి–శృతిరెడ్డిలతో పాటు, టీడీపీ జనసేన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విఎస్‌యులో.. 'హరిత యోగా'

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో యోగా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విశాఖలో ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తదితరులు పాల్గొన్న యోగా కార్యక్రమానికి సంబంధించిన వీడియో సందేశాలను విఎస్‌యులో ప్రసారం చేసి విద్యార్థులకు స్ఫూర్తిని కలిగించారు. యోగా శిక్షకులు భార్గవ కృష్ణ ఆధ్వర్యంలో యోగా సాధన చేశారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై "హరిత యోగా" కార్యక్రమాన్ని ప్రారంభించి మొక్కలు నాటారు. యోగా సాధనతోపాటు ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత, విఎస్‌యు ఎన్ఎస్ఎస్ సెల్ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# యోగాతో ఆరోగ్యం, ఆయువు పెరుగుతాయి

## - కళాభినేత్రి వాణిశ్రీ



యోగాతో ఆరోగ్యం, ఆయువు పెరుగుతాయని, అందువల్ల యోగాను అందరూ ఆచరించాలని అలనాటి ప్రముఖ సినీనటి, కళాభినేత్రి వాణిశ్రీ అన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, వారు, శేష ఇం.మీ హైస్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరు సమీపంలోని బుజబుజనెల్లూరులో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిత్యం యోగా చేయడం ద్వారా మనశ్శాంతి, ఆరోగ్యం, ఆయుషుతోపాటు జీవన విధానం మెరుగవుతుందన్నారు. తల్లిలాంటి యోగాని దైవం మనకు అందించిందని, భారతదేశ యోగ ప్రక్రియ ప్రపంచాన్ని ఆకర్షించిందని అన్నారు. తనకు వివాహమై ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత 120 కిలోలు పెరిగినానని, మావారు డాక్టర్ అయినప్పటికీ బరువును తగ్గించడం వీలు కాలేదన్నారు. ఒకసారి నెల్లూరు సమీపంలో ఒక యోగ ఆశ్రమంలో చేరి 20 నెలల్లో దాదాపు 65 కేజీలు పైగా బరువు తగ్గానని, ఎలాంటి సర్జరీలు గానీ మాత్రలు గాని, మందులు గాని వేసుకోకుండా కేవలం యోగా ద్వారా కొన్ని రకాల ఆరోగ్య సూత్రాలు, ఆహార నియమాలు పాటించి బరువు తగ్గానన్నారు. అనంతరం పీఎంపీ అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, శేషు స్కూల్ కరస్పాండెంట్ ఆదిశేషు వాణిశ్రీని ఘనంగా సత్కరించారు. నారాయణ మెడికల్ గ్రూప్స్ ఏజీఎం భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ బద్దెపూడి నరసింహ గిరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, జిజిహెచ్ అసిస్టెంట్ సివిల్ సర్జన్ డా.బద్దిపూడి సురేంద్ర, పీ.హెచ్.పీ జిల్లా గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్, కోశాధికారి దేవరకొండ శ్రీనివాసులు, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, ప్రసాదరావు, నాగేశ్వరరావు, సాయి, షఫీ, కరిముల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్‌లో.. యోగా సాధన



యోగా ఓ మంచి శక్తివంతమైన ఆరోగ్య సాధనమని కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో జరిగిన యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 10–ఏ నావెల్ యూనిట్ ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గౌడంగవే మార్గదర్శకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో యోగా నిపుణులు నయాగో స్కూల్ ఆఫ్ యోగా వ్యవస్థాపకుడు టి.యజ్ఞేష్ సింగ్, యోగా బోధకురాలు సునోలా, ఏ.రామభాగ్య తదితరులతో పాటు, 600 మందికి పైగా విద్యార్థులు మరియు అధ్యాపకులు యోగాలో పాల్గొన్నారు. వివిధ యోగాసనాలను అభ్యసించారు. విద్యార్థులు సమగ్ర అభివృద్ధి కోసం రోజువారీ జీవితంలో యోగాను ఆచరించాలని డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# నెల్లూరు కబుర్లు

## చిన్నారిని ఆదుకుంటాం

ప్రశాంతమ్మ హామీ



ఇందుకూరుపేట మండలం కుడితిపాలెం గ్రామం కాకర్లదిబ్బలో ఇటీవల చిత్రహింసలకు గురైన బాలికను విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఆదుకుంటామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఈనెల 24న నెల్లూరులోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ చిన్నారిని ఆమె పరామర్శించారు. ఆ బాలికను చిత్రహింసలకు గురి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరామన్నారు. నిందితులను ఎట్టి పరిస్థితుల్లో వదిలేది లేదని స్పష్టం చేశారు. చికిత్స పొందుతున్న చిన్నారి కోలుకున్నాక ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా పాఠశాలలో చేర్పించి, ఆ బాలిక బాగోగులు చూస్తామన్నారు.

### టీడీపీ గెలుపే లక్ష్యంగా..

## మదన్ ముందడుగు



నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 19 డివిజన్‌లో టిడిపి నాయకుడు నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి ఇటీవల ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'సమస్య మీది ..పరిష్కరించే బాధ్యత నాది' అంటూ ఆయన బుధవారం నుంచి స్థానిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఇంటింటికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకోనున్నారు. తెలుగుదేశం పార్టీకి ఇప్పటికే ఈ డివిజన్ కంచుకోటగా ఉంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి 750కి పైగా ఓట్ల మెజారిటీ లభించింది. డివిజన్ పరిధిలో ప్రధానంగా ఉన్న మాగుంట లేఔట్, ముత్యాలపాలెంతో పాటు అనేక ప్రాంతాల్లో టీడీపీకి మంచి పట్టు ఉంది. సార్వత్రిక ఎన్నికల తర్వాత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి అనేక మంది తెలుగుదేశం పార్టీలో చేరడంతో ఈ ప్రాంతంలో ఆ పార్టీకి తిరుగులేని విధంగా తయారైంది. ఈ నేపథ్యంలో 'సమస్య మీది .పరిష్కరించే బాధ్యత మాది' అనే కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకమై తిరుగులేని శక్తిగా తెలుగుదేశం పార్టీని గెలిపించాలన్న లక్ష్యంతో మదన్‌కుమార్‌రెడ్డి ఈ కార్యక్రమానికి ప్రణాళిక రూపొందించారు. వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

## బాలికపై దాడి అమానుషం

### సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



ఇటీవల దాడికి గురై నెల్లూరు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇందుకూరు పేట మండలం కుడితిపాళెం ఎస్టీ కాలనీకి చెందిన బాలికను సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరామర్శించారు. సెల్‌ఫోన్ విషయంలో గరిటె కాల్చి ముఖం, కాళ్లు, చేతులపై వాతలు పెట్టడం దుర్మార్గమంటూ ఆయన మండిపడ్డారు. అంతటి అమానుషానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆ చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించి, బాలికకు 10వేల రూపాయలను సాయంగా అందజేశారు.

## వైకాపా 'యువత పోరు'



వైకాపా యువజన విభాగం ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరులో జరిగిన 'యువత పోరు' కార్యక్రమానికి పెద్దసంఖ్యలో యువత తరలివచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. యువత సమస్యలపై వినూత్న రీతిలో రిక్షా తొక్కుతూ నిరసన తెలియజేసిన యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఊటుకూరు నాగార్జున ఆధ్వర్యంలో, నెల్లూరు పాత జడ్పీ ఆఫీస్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం యువతకు ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను నిరసిస్తూ వారు నినాదాలు చేశారు.

## దాతలకు వాకర్స్ సన్మానం



వేసవి క్రీడా శిక్షణా శిబిరాలలో శిక్షణ పొందిన క్రీడాకారులకు పౌష్టికాహారం అందించిన పలువురు దాతలను స్థానిక వివేకానంద వాకర్స్ అసోసియేషన్ వారు అభినందించి సన్మానించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు నేతాజీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ, ఈ అసోసియేషన్ పలు సేవా కార్యక్రమాల్లో ముందుంటోందని కొనియాడారు. అనంతరం, 300మంది వాకర్స్‌కు బి.పి, షుగర్ పరీక్షలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జికె గోపీనాథ్, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రషెట్టి, సభ్యులు డీవీ సుబ్బరాజు, స్వర్ణ రమేష్‌బాబు, వాకర్స్ ఎలక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, మురళీకృష్ణారెడ్డి, గణేష్, చంద్రమౌళి, డాక్టర్. సత్యనాథ్, కృష్ణమూర్తి, శ్రీధర్, మాజీ గవర్నర్ ఏకొల్లు రాఘవరెడ్డి, సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### అపోలో ఆసుపత్రిలో..

## క్యాన్సర్‌కు అత్యాధునిక చికిత్సలు

నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో అన్ని రకాల క్యాన్సర్‌లకు అత్యాధునికమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని హాస్పిటల్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ తెలిపారు. హాస్పిటల్ ఆంకాలజీ ఫిజీషియన్ డాక్టర్ హరిత, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ జి.వి. ప్రసాద్, మానసిక వైద్యులు డాక్టర్ లక్ష్మీ రాజేష్, యూనిట్ హెడ్ బాల రాజుతో కలిసి ఆయన ఇటీవల విలేకర్లతో మాట్లాడారు. అపోలో సంస్థ దేశవ్యాప్తంగా 'క్యాన్సర్ విన్' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా, క్యాన్సర్ వ్యాధి బారినపడి అపోలో ఆసుపత్రిలో చికిత్స తీసుకుని, క్యాన్సర్‌ను పూర్తిగా జయించి, నేడు ఆరోగ్యకరమైన జీవితం గడుపుతున్న వారి మనోగతాలను ప్రజలకు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. క్యాన్సర్ రోగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ఈ కార్యక్రమాన్ని నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో కూడా నిర్వహించడం సంతోషంగా ఉందని వైద్యులు తెలియజేశారు. నెల్లూరు అపోలో హాస్పిటల్‌లో అన్ని రకాల క్యాన్సర్లకు అధునాతనమైన వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, అనుభవజ్ఞులైన డాక్టర్లు వైద్యసేవలు అందించేందుకు 24 గంటలూ అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు.

### విజయ డెయిరీ ఉద్యోగుల..

## వయోపరిమితి పెంపు



నెల్లూరు విజయ డెయిరీలో పనిచేస్తున్న సిబ్బంది ఉద్యోగ వయోపరిమితిని 58 నుండి 60 సంవత్సరాలకు పెంచుతూ విజయ డెయిరీ పాలకమండలి ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. సోమవారం నెల్లూరులోని వెంకటేశ్వరపురంలో ఉన్న విజయ డెయిరీ కార్యాలయంలో ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి అధ్యక్షతన పాలకమండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఛైర్మెన్ తీసుకున్న ఆ నిర్ణయానికి, పాలక మండలి సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అందుకు ఉద్యోగులంతా హర్షం వ్యక్తం చేశారు. ఛైర్మెన్, బోర్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఐటీఐలలో దరఖాస్తులకు ఆహ్వానం

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో చేరాలనుకున్న విద్యార్థుల కోసం రెండో విడతగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నెల్లూరులోని వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తొలి విడతలో మిగిలిన సీట్లకు జులై 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ద్వారా కానీ, లేదా కళాశాలల్లోనైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వీరికి ప్రభుత్వ కళాశాలల్లో జులై 21 నుంచి 22 వరకు, ప్రైవేటు కళాశాలల్లో 23 నుంచి 25 వరకు కౌన్సిలింగ్ ఉంటుందని, వివరాలకు ఆయా కళాశాలల్లో సంప్రదించాలని సూచించారు.




## తూకాలపై అధికారుల తనిఖీలు



స్పందన చారిటబుల్ ట్రస్టు వారు, ప్రజల ఫిర్యాదులతో ఇటీవల నెల్లూరులోని పొదలకూరురోడ్డు, డైకాస్‌రోడ్డు, గాంధీ నగర్, రోడ్డుమార్జిన్‌లలో ఉన్న పలు దుకాణాల్లో తూనికలు కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. చేపల వ్యాపారుల వద్దనున్న కాటాలను, వినియోగదారులు కొనుగోలుచేసిన చేపలను తూకం వేసి పరిశీలించారు. వ్యాపారులు ఉపయోగిస్తున్న తూకపురాళ్ళు, తూనిక పరికరాల్లో తేడాలను చూసి, మోసాలకు పాల్పడుతున్నవారిని గుర్తించి 3 కేసులు పెట్టారు. ఆ కాటాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. స్పందన చారిటబుల్ ట్రస్ట్, చైర్మన్ షేక్ ఖాసీం మరియు సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలు కూడా చేపలు కొనుగోలు చేసే సమయంలో తూకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ ఇన్స్‌పెక్టర్ షేక్ రియాజ్ అహ్మద్ కోరారు.

## ఆవుల బెడద నివారించండి

నెల్లూరు నగరంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న వీధి ఆవుల బెడద నివారించాలంటూ జనసేన పార్టీ సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ ఇటీవల నగరపాలక సంస్థ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. అదే విధంగా డ్రైనేజీ వ్యర్థాల అక్రమ డంపింగ్‌పై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆ వ్యర్థాలను పెన్నానది వద్ద, దేవస్థానం రోడ్డులో వేస్తున్నారని, వాటిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.

# సర్వాంగ సుందరంగా.. వీఆర్ హైస్కూలు

## త్వరలోనే ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభోత్సవం



నెల్లూరు నగరంలో వీఆర్ హైస్కూలు అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా తయారవుతోంది. ఆ పనులను ఎప్పటికప్పుడు మంత్రి నారాయణ పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఈ హైస్కూలు ప్రారంభోత్సవానికి పెద్దఎత్తున కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ, ఆధునీకరణ పనులు చివరిదశలో ఉన్నాయని, జూన్ 30వతేదీ నుంచి పాఠశాల ప్రారంభమవుతుందని తెలిపారు. తరగతి గదుల్లో డిజిటల్ బోర్డ్స్, లేటెస్ట్ ఫర్నిచర్, ఆకర్షణీయమైన పెయింటింగ్స్ ఏర్పాటుపై మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. అందరూ ఆశ్చర్యపడేలా వీఆర్ హైస్కూల్‌ను సిద్ధం చేసిన ఎన్సీసీ సిబ్బందిని అభినందించారు. నెల్లూరు నడిబొడ్డులో ఉన్న వీఆర్ హైస్కూల్‌ని గత ప్రభుత్వం అనాలోచితంగా మూసేసిందని మండిపడ్డారు. 2014లో మంత్రిగా ఉన్నప్పుడు వీఆర్‌సీలో ఇంటర్ రెసిడెన్షియల్ పెట్టి 300 మందికి విద్యాబుద్ధులు నేర్పామని గుర్తు చేశారు. దాని ఫలితంగా అప్పట్లో ఐఐటీ, ఎన్ఐటీలలో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. అలాంటి హైస్కూల్‌ని గత ప్రభుత్వం మూసివేయడం దుర్మార్గమని మండిపడ్డారు. తాను చదివిన స్కూల్‌కి పూర్వవైభవం తెస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చానని, ఆ మాట ప్రకారం వీఆర్సీ హైస్కూల్‌ని అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో సిద్ధంచేస్తున్నామని చెప్పారు. వీఆర్సీని అద్భుతంగా తీర్చిదిద్దిన ఎన్సీసీ సిబ్బందితోపాటు తన కుమార్తెలను అభినందిస్తున్నట్లు తెలియజేశారు. మరో నాలుగు రోజుల్లో వీఆర్ హైస్కూల్‌కి సంబంధించి 100 శాతం పనులు పూర్తి అవుతాయన్నారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, కార్పొరేషన్ కమీషనర్ నందన్, టీడీపీ నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. ప్రారంభానికి ముస్తాబౌతున్న పేదపిల్లల సరస్వతీ నిలయం పట్ల మంత్రి నారాయణ చేస్తున్న కృషిని పలువురు కొనియాడారు.

# ఉడ్ కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేస్తాం



**- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి**

నెల్లూరు రూరల్‌లోని ఉడ్ కాంప్లెక్స్‌ని త్వరలోనే అభివృద్ధి చేస్తామని, ఆటోనగర్‌ను తీర్చిదిద్దినట్లుగానే ఉడ్ కాంప్లెక్స్‌లో కూడా రోడ్ల నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన స్థానిక 26వ డివిజన్‌లోని ఉడ్ కాంప్లెక్స్‌లో రూ.1.50కోట్ల రూపాయలతో నిర్మించిన సీసీ డ్రెయిన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉడ్‌కాంప్లెక్స్ అభివృద్ధి అనేది దశాబ్దాల నాటి కల అని, ఇంత కాలానికి తమ కూటమి ప్రభుత్వ హయాంలో సాకారం కానుందని చెప్పారు. అధికారంలోకి వచ్చిన ఈ సంవత్సర కాలంలో నెల్లూరురూరల్ అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎనలేని సహకారం అందిస్తున్నారని, రూరల్ నియోజకవర్గ ప్రజల పక్షాన ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలని అన్నారు. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ సుప్రజ, క్లస్టర్ ఇన్‌చార్జ్ మన్నెం పెంచలనాయుడు, కో క్లస్టర్ ఇంచార్జ్ ఎల్.పి.కృష్ణారెడ్డి, 26వ డివిజన్ అధ్యక్షులు పురుషోత్తం యాదవ్, టీడీపీ నాయకులు శివాచారి, గౌస్ బాషా, వెంకటేశ్వర్లు యాదవ్, జహీర్, జావీద్, మాధవి, రఫి, శంకర్ పాల్గొన్నారు.

# ఆ మూడూ.. బీజేపీ పార్టీలే!

## ➤ టీడీపీ - జనసేన - వైకాపాల తీరుపై.. పీసీసీ చీఫ్ షర్మిల విమర్శ




రాష్ట్రంలో టీడీపీ-జనసేన, వైసీపీ మూడూ బీజేపీ పార్టీలేనని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. బీజేపీ పాలనపై, కూటమి ప్రభుత్వంపై, అటు వైకాపా తీరుపై ఆమె విమర్శలు గుప్పించారు. వాటి తీరు సరికాదంటూ ధ్వజమెత్తారు. బీజేపీతో పోరాడగలిగేది ఒక్క కాంగ్రెస్ మాత్రమేనన్నారు. ఈనెల 24న నెల్లూరులోని ఇందిరాభవన్‌లో జరిగిన కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తన ఉనికిని కాపాడుకునేందుకే జగన్ బలప్రదర్శనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. జగన్ కారు కిందపడి ఓ వ్యక్తి మరణిస్తే, ఆ సంఘటనకు బాధ్యత వహించకుండా, సమర్థించుకోవడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా రాష్ట్రానికి ఎలాంటి మేలు జరగడం లేదన్నారు. పోలవరం ప్రాజెక్టును 45 అడుగుల ఎత్తు కట్టాల్సి ఉన్నప్పటికీ, కేంద్రం 41 అడుగులే కడతామంటూ పార్లమెంట్‌లో తీర్మానం చేసిందని, దానిని ఒక్క ఎంపీ కూడా ప్రశ్నించడం లేదని ఆమె విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. యువతకు ఉద్యోగ భృతి కల్పిస్తామన్న చంద్రబాబు ఆ హామీని విస్మరించారని ఆరోపించారు. కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలంతా ఉద్యమించాలని ఆమె కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు అండగాఉంటూ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలన్నారు. తొలుత, నగరంలో ర్యాలీ నిర్వహించారు. డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ యశోదర, నాయకులు ఎల్లసిరి శ్రీనివా సులురెడ్డి, తలారి బాలసుధాకర్, అల్లా ఉద్దీన్, గోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# 'ఆరోగ్యస్వర్ణాంధ్ర'.. యోగాంధ్ర లక్ష్యం

**• మంత్రి ఆనం**

ఆరోగ్య స్వర్ణాంధ్ర సాకారమే యోగాంధ్ర లక్ష్యమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన ఆత్మకూరు నియోజకవర్గం చేజర్ల మండల పరిధిలోని పెరుమళ్ళపాడు వ్యవసాయక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ధ్యానం, యోగాసనాలు చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "యోగాంధ్ర" కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టడం దేశం గర్వించదగ్గ విషయమన్నారు. "యోగ అనేది శారీరకంగా, మానసికంగా దృఢంగా నిలబెట్టే ప్రాచీన భారతీయ సంపద అని ఆయన అన్నారు. యోగాను ప్రోత్సహించటం ప్రతి ఒక్కరి బాధ్యతగా స్వీకరించి యువతలో ఆరోగ్యవంతమైన జీవనశైలి పట్ల అవగాహన పెంపొందించాలన్నారు. జీవితంలో ఒత్తిడిని జయించాలంటే యోగా సరైన మార్గమని మంత్రి ఆనం తెలిపారు.

# బాలికపై చిత్రహింసలు దారుణం

## • రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ ఆవేదన



సెల్‌ఫోన్ దొంగతనం జరిగితే, జ్యోతిష్కుల మాటలు నమ్మి బాలికకు వాతలు పెట్టి చిత్రహింసలకు గురిచేయడం దారుణమని రాష్ట్ర మహిళా ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 24న ఆమె నెల్లూరులో పర్యటించారు. ఇటీవల ఇందుకూరుపేట మండలం కుడితిపాళెం కాకర్లదిబ్బలో ఓ పదేళ్ళ బాలికపై జరిగిన అఘాయిత్యాలపై ఆమె ఆరాతీశారు. నెల్లూరు అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ బాలికను ఆమె పరామర్శించారు. అదేవిధంగా, నెల్లూరు రూరల్‌లోని కనుపర్తిపాడు వద్ద అఘాయిత్యానికి గురైన ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికతో కూడా మాట్లాడారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, కాకర్లదిబ్బ ఘటనలో..ఆ బాలిక తల్లితండ్రులు ఉపాధికోసం దూరప్రాంతానికి వెళ్తూ, తెలిసిన వారింట్లో ఆ బాలికను వదిలారని, అయితే పక్కింట్లో సెల్‌ఫోన్ చోరీ జరిగిందంటూ ఈ బాలికను చిత్రహింసలు పెట్టారని ఆమె తెలిపారు. ఆ ఘటనకు సంబంధించి అయిదుగురు నిందితుల్లో నలుగురిని అరెస్ట్ చేశారన్నారు. మహిళలు, చిన్నారుల పట్ల, బాలికల పట్ల అఘాయిత్యాలకు పాల్పడితే సహించేది లేదని, కఠినచర్యలు తప్పవని ఆమె ఈ సందర్భంగా హెచ్చరించారు.





# యుద్ధం, శాంతి.. మధ్యలో అశాంతి

"యుద్ధాలు భగవంతుడి చర్యలు కావు. యుద్ధాలకు కారణం మనిషి, లేదంటే మనిషి సృష్టించిన వ్యవస్థలు, లేదంటే మనిషి తన సమాజాన్ని వ్యవస్థీకరించుకున్న తీరే" అని అమెరికా మాజీ ప్రధాన న్యాయమూర్తి ఫ్రెడెరిక్ మూరే అంటారు. ఇటీవల కాలంలో ప్రపంచంలో ఎటు చూసినా ఘర్షణ పూరిత వాతావరణం కనిపిస్తుండడంతో పాటు యుద్ధాలు జరుగుతున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ఎంతో సబబు అనిపిస్తాయి.

ఒక పక్క రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతోంది. ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధం కొనసాగుతోంది. మరో పక్క ఇటీవలే ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధం జరిగింది. చివరిలో అమెరికా కూడా చేరి యుద్ధాన్ని కొలిక్కి తెచ్చింది. అత్యంత శక్తిమంతమైన బి2 బాంబర్లను రంగంలోకి దించి ఇరాన్ అణు సామర్థ్యాన్ని దెబ్బతీసినట్లు ప్రకటించింది. లక్షల కోట్ల రూపాయలు ఇలాంటి యుద్ధాల్లో కాలి బూడిదయిపోతున్నాయి. అంటే కరెన్సీ నోట్లు కాలి బూడిదవుతున్నాయని కాదు. పేలుతున్నబాంబులు, క్షిపణులు, డ్రోన్ల కోసం పెడుతున్న ఖర్చు, బాంబుల ధాటికి కూలుతున్న భవంతుల ఖర్చు అది. ఆ డబ్బంతా యుద్ధానికి నాయకత్వం వహిస్తున్న ట్రంప్ లేదా నెతన్యాహు లేదా పుతిన్ లేదా ఖొమైనీ లేదా మరొకరో కష్టపడి సంపాదించింది కాదు. అదంతా ప్రజల కష్టార్జితం. వారు కడుతున్న పన్నులతో ప్రభుత్వం వద్ద జమపడిన డబ్బు. చివరికి యుద్ధం వల్ల లాభం చేకూరుతున్నది ఆయుధాల తయారీ సంస్థలకు, ఆయుధాలను మోసుకెళ్లే వాహకాల తయారీ సంస్థలకు. నష్టం వాటిల్లుతున్నది సామాన్య ప్రజలకు. యుద్ధం జరిగినన్నాళ్లూ ఎవరికీ కంటి మీద కునుకు ఉండడం లేదు. యుద్ధంలో సర్వం కోల్పోయిన వారి భవిష్యత్తు అగమ్య గోచరం. యుద్ధం జరుగుతున్న సమయంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఒక మాట అన్నారు. "శక్తి ద్వారానే శాంతి వస్తుంది అని ట్రంప్, నేను తరచూ ఒక మాట అంటుంటాం. మొదట శక్తిని ప్రదర్శించాలి. ఆ తర్వాత శాంతి దానంతట అదే వస్తుంది. ట్రంప్, అమెరికా చాలా శక్తిని ప్రదర్శించింది." అని ఆయన అన్నారు. అంటే బలవంతుడిదే రాజ్యం అని ఆయన చెబుతున్నట్లుంది. బల ప్రయోగం చేస్తే అందరూ మాట్లాడకుండా ఉంటారు, అదే శాంతి అన్నట్లుంది. నిజమే బలవంతుడిని చూసి మిన్నకుంటారు. కానీ అటువంటి శాంతి ఎన్నాళ్లుంటుంది? మరోపక్క ట్రంప్.. ప్రపంచంలో తనంతటి శాంతి దూత మరొకరు లేరు అని చెప్పుకుంటున్నారు. ఆయన కళ్లు నోబెల్ శాంతి బహుమతి మీద పడ్డాయి. దానికి తనకు మించి అర్హుడు మరొకరు లేరు అని అనుకుంటున్నారు. అమెరికా పూర్వ అధ్యక్షుడు, ప్రత్యర్థి పార్టీకి చెందిన ఒబామాకు నోబెల్ శాంతి బహుమతి రావడంతో ట్రంప్ కూడా దాని కోసం ప్రయత్నిస్తున్నారు. ఇరాన్‌తో అణు ఒప్పందాన్ని రద్దు చేసుకున్న ట్రంప్.. తాజాగా ఇరాన్ పై యుద్ధంలో ఇజ్రయెల్ కు సహాయం చేసిన ట్రంప్... తనను తాను శాంతి దూతగా ప్రకటించుకోవడానికి మించిన హాస్యాస్పద అంశం మరొకటి ఉండదు. పైగా ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాదానికి తోడ్పాటునందించే పాకిస్థాన్ నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ పేరును ప్రతిపాదించడం మరింత హాస్యాస్పదం. ఒకపక్క ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తున్న రష్యా, ఇరాన్ ఇజ్రాయిల్ మధ్య దౌత్యానికి ప్రయత్నిస్తానని చెప్పటం కూడా హాస్యాస్పదమే. శాంతి భావం ఎంత అలుసయిపోయింది? నెతన్యాహు చెప్పినట్లు బల ప్రదర్శన ద్వారానే శాంతి వస్తుందనుకుంటే ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో బల ప్రదర్శన చేయాలనే అనుకుంటారు. యుద్ధంలో ఓడిన వారు ప్రతీకారంతో తమను తాము బలోపేతం చేసుకుని తమ బలాన్ని రుజువు చేయాలనే అనుకుంటారు. తాజా యుద్ధాన్నే గమనిస్తే ఇరాన్ అణు సామర్థ్యాన్ని దెబ్బతీశామని ఇజ్రాయెల్, అమెరికా ప్రకటించాయి. అయితే తాము అణు సామర్థ్యాన్ని సమకూర్చుకునే ప్రయత్నాలు ఆపబోమని ఇరాన్ ప్రకటించింది. అంటే ఇజ్రాయెల్ లేదా అమెరికా బల ప్రదర్శన ద్వారా ఏమి సాధించినట్లు? లక్షలమంది ప్రజల జీవితాల్లో అశాంతి తప్ప? ప్రతి ఒక్క దేశమూ బల ప్రదర్శన చేయాలనుకుంటే ఇక శాంతి నెలకొనడానికి కావాల్సిన విరామం ఎక్కడ ఉంటుంది? యుద్ధం తర్వాత శాంతి అనే సిద్ధాంతాన్ని పట్టుకుని వేలాడితే ప్రపంచంలో నిత్యం అశాంతే రాజ్యమేలుతుంటుంది. నిజమైన శాంతి పరస్పరం అర్థం చేసుకోవడంలోనే ఉంటుంది. దానికి దౌత్య మార్గమే శరణ్యం. నిత్యం చర్చోపచర్చలు జరుగుతూనే ఉండాలి. మనిషికి కావాల్సింది అన్న వస్త్రాలు కానీ అణ్వస్త్రాలు కాదు. పిడికెడు అన్నం లేక ప్రపంచంహొ నలుమూలలలా అల్లాడుతున్న వారెందరో. ఆ దిశగా దేశాలు కృషి చేయాలి. కానీ వనరులపై అత్యాశ కారణంగానే ఎక్కువ సంఘర్షణలు ప్రారంభమవుతున్నాయి. ఈ రోజు ఉన్నసాంకేతిక పరిజ్ఞానం నేపథ్యంలో కయ్యానికి కాలుదువ్వడం వల్ల మానవాళి మొత్తం ప్రమాదంలో పడుతుంది. యుద్ధానికి కారణం ఏదైనా కావచ్చు కానీ అవతలి వారిని శత్రువుగా నిర్ణయించుకోబట్టే యుద్ధం చేస్తుంది. వాస్తవానికి మానవాళికి యుద్ధమే అతిపెద్ద శత్రువు. ఈ వాస్తవాన్ని గ్రహించగలిగితే యుద్ధాలు జరగవు.

మనసులో మాట 51



తుమ్మల బాల గంగాధర్ తిలక్



## జానకిరామ.. రామాయణం 71

- ఊటుకూరు జానకి రామారావు



నేరేడు, మొరటి, పనస, జువ్వి, మర్రి, తుమ్మిక, రావి, కొండగోగు, మామిడి, చంద్ర, పొన్న, బొగ్గు, కానుగ, అశోక, కదంబ, గన్నేరు, భల్లాతక, నల్ల అశోక, రక్తచందన, వేప వృక్షజాతులతో ఆ అరణ్యం శోభాయమానంగా ఉండును.

నీవూ, లక్ష్మణుడు ఆ వృక్షాలను ఎక్కిగానీ, బలం చేత క్రిందకు పడగొట్టి కానీ దారులు చేసుకొని మరియూ వాటి అమృత ఫలములను భక్షిస్తూ వెళ్ళండి.

రామా పుష్పించిన ఆ వనం దాటిన పిమ్మట మరియొక సుందరమైన వనముంది. చైత్రరథమునందువలే ఆ వనమందు అన్ని ఋతువులు ఒకే సమయంలో ఉండును.

రామా అచటనున్న పర్వతం దాటి మరియొక పర్వతం తదుపరి మరియొక వనం దాటిన పిదప మీరు పంప అనే పద్మ సరస్సును చేరగలరు.

ఆ సరస్సు కదు నిర్మలంగా ఉంటుంది, జారుడు ప్రదేశం గానీ నాచు గానీ అస్సలు కనుపించదు. అన్ని ప్రదేశాలు సమతలంగా ఉంటాయి. అక్కడ హంసలు నీరుకోళ్ళు, క్రౌంచ పక్షులు, కురరపక్షులు మధురధ్వనులతో ఆ సరస్సులో కూస్తూ కనబడతాయి. నేతిముద్దల వలె పెద్దప్రమాణంలో ఉన్న పక్షులను మీరు భక్షించవచ్చును.

ఆ రమణీయమైన ప్రదేశం నీ దుఃఖం పోగొట్టగలదు.

అక్కడ మతంగ మహాముని శిష్యురాలు శబరి, తన తోటివారంతా స్వర్గస్థులైనా కన్నులలో ప్రాణాలు నిలుపుకొని నీ దర్శనం కొరకు ఎదురుచూస్తూ ఉంటుంది.

ఆ పంపా తీరానికి పడమర దిక్కున నీకు సాటిలేనిదీ, రహస్యమూ అయిన ఒక ఆశ్రమం కనపడుతుంది. ఆ ఆశ్రమం నందు ఇప్పటికీ మతంగ మహాముని ఏర్పాటు చేసిన నియమాలు పాటింపబడుతున్నాయి.

దానికి ఇంకాస్త ముందుకు వెళ్ళినచో ఋష్యమూక పర్వతం నీకు అగుపించగలదు.

ఆ పర్వతం మీద నిదురించినవారు తమ కలలో చూసిన ధనాన్ని వెంటనే పొందగలరు.

దురాచారి అయినవాడు ఆ కొండ ఎక్కినచో అతనిని నిద్రలోనే రాక్షసులు చంపివేయుదురు.

రామా! ఆ పర్వతం మీద ఒక పెద్ద గుహ ఉండి దానికి అడ్డంగా ఒక పెద్ద కొండరాయి నిలబెట్టబడి ఉంటుంది.

ఆ గుహలోనే తన అనుచరులైన నలుగురు వానరులతో కలిసి సుగ్రీవుడు నివసిస్తున్నాడు.

అని కబంధుడు చెప్పగా రామలక్ష్మణులు విని అతనిని ఇక నీవు వెళ్ళు! అని అనుమతించారు.

రామలక్ష్మణులు కబంధుడు చెప్పిన మార్గంలో ప్రయాణించి పంప సరోవర మార్గాన్ని చేరారు.

అక్కడ ఉన్న పర్వతాలమీద సుగ్రీవుడు ఎక్కడ ఉన్నాడా అని చూసుకుంటూ వెళుతున్నారు.

అలా వెళుతూ వెళుతూ పంపా సరోవర పశ్చిమ భాగాన్ని చేరారు.

అక్కడ వారికి వృద్ధ తాపసి, మతంగముని శిష్యురాలు అయిన శబరి కనుపించింది.

ఆవిడ రామలక్ష్మణులను చూసి లేచి అంజలి ఘటించి నమస్కరించింది.

తీవ్రమైన నియమాలు పాటిస్తూ తపస్సు చేస్తున్న శబరిని చూసి ఆదరంగా కుశల ప్రశ్నలు వేశాడు రాఘవుడు.

తల్లీ శబరీ నీవు చాంద్రాయణాది వ్రతములన్నీ పూర్తిచేసుకున్నావా, నీ తపస్సు సిద్ధించినదా అని ప్రశ్నించాడు రాముడు.

అందుకు సమాధానంగా శబరి, రామా! నీ దర్శన భాగ్యమే నా తపస్సు సిద్ధించినదనుటకు చిహ్నమయ్యా!

నా గురువు గారు నాకు చెప్పిన విధంగా నీ దర్శనం వలన నా జన్మ చరితార్థమైంది రామా! నేటితో నాకు సకలం సిద్ధించింది రామా... అని పలికి మతంగవనం నుండి తాను సేకరించిన మధుర ఫలాలతో వారికి ఆతిథ్యమిచ్చి, రామా నీ అనుజ్ఞ అయినచో నా కళేబరాన్ని విడిచిపెట్టేస్తానయ్యా అని పలికింది ఆ వృద్ధ తాపసి.

అంత రాముడు అనుజ్ఞ ఇవ్వగనే తన శరీరాన్ని అగ్నిలో హోమం చేసి స్వర్గానికి వెళ్ళిపోయింది శబరి.

మరల అచట నుండి బయలుదేరి సుగ్రీవుడు నివసించే పర్వత సమీపానికి వెళ్ళారు రామలక్ష్మణులు.

అప్పుడు రాముడు, లక్ష్మణా! సీతను పోగొట్టుకొని నా మనస్సు సీతపైననే నిత్యం లగ్నమై ఉంది, నేను దీనుడను, నీవు సుగ్రీవుని వద్దకు వెళ్లి మన రాకను ఎరిగించుము అని పలికాడు రాముడు.

ఇలా మాట్లాడుకుంటూ నెమ్మదిగా ఆ సరోవర తీరం చేరుకున్నారు.

**శ్రీమద్రామాయణము అరణ్య కాండము సమాప్తం.**



**'లాయర్' పత్రికలో వారం వారం ప్రచురితమౌతున్న ఊటుకూరు జానకి రామారావు గారి 'జానకి రామ రామాయణం' ఇటీవలే పుస్తకంగా ముద్రితమైంది. పాఠకులకు ఆ పుస్తకం అందుబాటులో ఉంది కూడా! కనుక ఈ ధారావాహికను 'అరణ్య కాండము' తో ముగిస్తున్నాము. పాఠకులు గమనించగలరని మనవి.**

**పుస్తక ప్రతుల కోసం 77026 60087 సెల్ నెంబరు నందు సంప్రదించగలరు. - సం/-**

# శ్రీసిటీలో..ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ

## - - పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం - -



ఏపీ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లి॥(ఏపీఎస్పీడీసీఎల్) ఛైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావ్ ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) కాకర్ల గురవయ్య, ఏపీ ట్రాన్స్కో డైరెక్టర్ (టెక్నికల్) జె.వెంకటేశ్వర రావుతో కలసి శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో విద్యుత్ సిబ్బంది, పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమయ్యారు. పరిశ్రమల విద్యుత్ వినియోగం, సరఫరా సమస్యలపై సమీక్ష చేశారు. పరిశ్రమల ప్రతినిధులు తమ దృష్టికి తీసుకొచ్చిన విద్యుత్ అంతరాయం, వోల్టేజ్ సమస్యలు, అప్రకటిత విద్యుత్ కోతలు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి సంబంధిత సమస్యలపై చర్చించారు. చర్చకు వచ్చిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. టెక్నికల్ విభాగానికి చెందిన విద్యుత్ అధికారులు మాట్లాడుతూ, పరిశ్రమలు ఉపయోగించే విద్యుత్ వ్యవస్థలు, విధానాలలో తలెత్తే కొన్ని లోపాలను వివరించడంతో పాటు చేయాల్సిన పనులు, చేయకూడని పనులను కూడా తెలిపారు. ఈ కార్యక్రమానికి వచ్చినందుకు విద్యుత్ అధికారులకు శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ తీసుకుంటున్న వినూత్న చర్యలు తప్పక సత్ఫలితాలు ఇస్తాయన్నారు. విద్యుత్ అంతరాయాలు మరియు ప్రమాదాలను నివారించడానికి, పవర్ ఇన్‌స్టాలేషన్ ప్రక్రియలో సరైన కాంట్రాక్టర్లు, నాణ్యమైన పరికరాలను ఎంపిక చేసుకోవాలని పరిశ్రమ వర్గాలకు సూచించారు. శ్రీసిటీ ఎలక్ట్రికల్ హెడ్ డి.ఎన్.రెడ్డి పాల్గొన్నారు.

# జగన్ జన సునామితో టీడీపీలో గుబులు

## - - వైకాపా నేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి - -



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనల్లో జన సునామీని చూసి టిడిపి నాయకుల్లో గుబులు మొదలైందని వెంకటగిరి నియోజకవర్గ వైయస్సార్సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గారు తెలిపారు. ఇటీవల వాకాడులోని నేదురుమల్లి నివాసంలో ఆయన వైఎస్‌ఆర్సిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, టీడీపీ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వైఎస్సార్సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతూ, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వైకాపా విజయం తధ్యమని మళ్లీ వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# దామవరం రైతుల ఆవేదన

విమానాశ్రయం పేరుతో చేపడుతున్న భూసేకరణలో తమ భూములు కూడా ఉన్నాయని, వాటికి పరిహారం అందించి తమను ఆదుకోవాలని దగదర్తి మండలం దామవరం గ్రామంలోని పలువురు రైతులు కోరుతున్నారు. ఇటీవల వారు నెల్లూరులో జిల్లా కలెక్టర్ ఆనంద్‌ను కలసి తమ గోడు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామ సర్పంచ్ నిమ్మకాయల ప్రసాద్ మాట్లాడుతూ తమ గ్రామంలో ఏళ్ళ తరబడిగా ప్రభుత్వ భూములు, డీకేటీ పట్టా భూములను 172 మంది దళితులు, బీసీ వర్గాల వారు సాగుచేసుకుంటున్నారని, ఆ భూముల వివరాల అధికారుల రికార్డుల్లో కూడా ఉన్నాయని, అయితే వారు భూసేకరణలో ఆ భూములను కూడా కోల్పోతున్నారని తెలిపారు. అవి పట్టాభూములు కాకపోవడంతో రైతులకు పరిహారం విషయం గురించి అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

# శ్రీసిటీలో యోగా దినోత్సవం




యోగా.. భారతీయులకు ఒక వరమని, ప్రాచీన భారతావని మానవాళికి అందించిన ఒక బహుమతి అని శ్రీసిటీ డైరెక్టర్ (సిఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి చెప్పారు. ఈనెల 21న శ్రీసిటీలో జరిగిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, యోగా సాధన ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని పొందవచ్చన్నారు. దైనందిక జీవితంలో యోగాను ఒక భాగం చేసుకొని, తద్వారా మంచి ఆరోగ్యం, చక్కని మానవ సంబంధాలు, మంచి ఆలోచనలను పెంపొందించుకోవాలని సూచించారు. యోగ ప్రాముఖ్యత దృష్ట్యా శ్రీసిటీ నివాస సముదాయంలో గుర్తింపు పొందిన శిక్షకుల ద్వారా ప్రతిరోజూ యోగ తరగతులు నిర్వహిస్తున్నామని, శ్రీసిటీ కుటుంబంలోని వారంతా దానిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొలుత, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు స్థానిక విజిటర్స్ సెంటర్ ఆవరణలో సుమారు 270మంది యోగా సాధనలో పాల్గొన్నారు. యోగా గురువు, ఏపీ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.కోదండం పాల్గొని, వారికి సూర్య నమస్కారాలు, వివిధ శ్వాస వ్యాయామాల పట్ల శిక్షణ ఇవ్వడంతో పాటు యోగా వలన కలిగే పలు ప్రయోజనాలను వివరించారు. శ్రీసిటీ పరిశ్రమల ప్రతినిధులు, ఉద్యోగులు, పోలీసులు, స్థానిక వివిధ పాఠశాలల విద్యార్థులు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్ పర్యవేక్షించారు. యోగా గురువు ప్రదర్శించే యోగాసనాల ప్రాముఖ్యత మరియు ప్రయోజనాలను అవినాష్ కన్న వివరించారు. శ్రీసిటీలోని పలు పరిశ్రమలలో అదే రోజున ఉత్సాహంగా యోగా దినోత్సవాన్ని జరుపుకున్నారు. హావెల్స్ లాయిడ్‌లో జరిగిన యోగా కార్యక్రమంలో ప్లాంట్ హెడ్ గిరీష్ చందర్, పలువురు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లతో పాటు అన్ని విభాగాల ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఆయుర్వేద వైద్య శిబిరం..

యోగా వేడుకల అనంతరం విజిటర్స్ సెంటర్ ఆవరణలో ప్రత్యేక ఆయుర్వేద శిబిరం నిర్వహించారు. శ్రీసిటీలోని తులసి ఆయుర్వేద ఆసుపత్రికి చెందిన డాక్టర్ శివప్రసాద్, వైద్య బృందం పాల్గొన్నారు. యోగాకు హాజరైన పలువురికి ఇందులో వైద్య సేవలు అందించడంతో పాటు సహజ ఆరోగ్యం మరియు ఆరోగ్యకరమైన జీవనశైలి పద్ధతులపై అవగాహన కల్పించారు.

# అదాని కృష్ణపట్నం పోర్టులో రక్తదాన శిబిరం

ముత్తుకూరు మండలంలోని అదాని కృష్ణపట్నం పోర్టులో ఈనెల 24న మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. పోర్టు సిఆర్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అదాని ఫౌండేషన్, రెడ్‌క్రాస్ సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో రక్తదాతల నుంచి 186 యూనిట్ల రక్తం సేకరించారు. పోర్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ పటేల్ రక్తదాతలను అభినందించారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే పాశిం



అమరావతిలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఈ నెల 23వ తేదీ మర్యాదపూర్వకంగా కలిశారు. గూడూరు నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు. తల్లికి వందనం, ఇతర ప్రభుత్వ పథకాలపై మాట్లాడారు. గూడూరు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని మంత్రి ఎమ్మెల్యే కోరారు.

# వివాహ వార్షికోత్సవాన సి.ఆర్.రెడ్డి విరాళం



రొటేరియన్ డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి - డాక్టర్ రోహిణి దంపతుల 42వ వివాహ వార్షికోత్సవ వేడుకలు ఇటీవల గూడూరు సి.ఆర్.రెడ్డి కళ్యాణ మండపంలో ఘనంగా జరిగాయి. వివాహ వార్షికోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సరస్వతి శిశు మందిరానికి అదనపు గదుల నిర్మాణం కోసం 2 లక్షల రూపాయలను తమ విరాళంగా ప్రకటించి ఆ మొత్తాన్ని శిశు మందిరం ఛైర్మెన్ మురళీధర్‌రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా మురళీధర్ సి.ఆర్.రెడ్డి దంపతులకు, రోటరీ క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి జి.జి.నాయుడు, రోటరీ క్లబ్, ఇన్నర్‌వీల్ సభ్యులు, సరస్వతి శిశు మందిరం ప్రధానోపాధ్యాయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు

# సకాలంలో జీతాలు చెల్లించాలి




ప్రాంతీయ వైద్యశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మహేంద్ర డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతంలో కార్మికులతో కలిసి ఈ నెల 24న ఏఐటియూసీ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ప్రభాకర్, పుట్టా మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలు తీర్చడానికే

# 'పొలం పిలుస్తోంది'



గూడూరు మండల పరిధిలోని పాలిచెర్ల, రాజుపాలెం గ్రామాలలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం గూడూరు వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. గూడూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బి.గోపి నాయక్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తున్న టెక్నాలజీని రైతులకు చేరవేసే విస్తరణ కార్యక్రమమే ఈ పొలం పిలుస్తుందన్నారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయ శాఖ అధికారి వి.రమేష్, ఉద్యాన అధికారిణి యన్.సునీత, గ్రామ వ్యవసాయ సహాయకులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



# లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయండి

గూడూరు రెండవ పట్టణంలోని కోర్టులో జులై 5న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంపై ఈ నెల 24న సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 7వ అదనపు జిల్లా జడ్జి కె.వెంకట నాగపవన్ మాట్లాడుతూ జులై 5న గూడూరు కోర్టు ప్రాంగణంలో జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించే దిశగా పోలీసులు చొరవ చూపాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బీవీ సులోచనరాణి, బార్ సెక్రెటరీ ఎంవి. కృష్ణయ్య, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఏ.కోటేశ్వర రావు, గూడూరు అర్బన్ సిఐ శేఖర్‌బాబు, రూరల్, చిల్లకూరు, మనుబోలు, సైదాపురం ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాలసదన్ పిల్లలకి రోటరీ బ్యాగులు



గూడూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ గూడూరు నరశింగరావుపేటలోని బాలసదన్‌లో రొటేరియన్ ఎ.శ్రీనివాస ఆచారి వారి సతీమణి స్వర్గీయ దేవకి జ్ఞాపకార్థం బాలసదన్ పిల్లలకి స్కూల్ బ్యాగ్‌లు, ప్లేట్లు, గ్లాసులు బహూకరించి, పిల్లలకు విందు భోజనం ఏర్పాటు చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి జి.జి.నాయుడు, పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ దశరథరామిరెడ్డి, క్లబ్ సభ్యులు, బాలసదన్ ఇన్‌ఛార్జి అరుణ, పిల్లలు పాల్గొన్నారు.

## 'శంకర నేత్రాలయ' ఆధ్వర్యంలో..

# సౌత్‌మోపూరులో ఉచిత కంటివైద్య శిబిరం



నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని సౌత్ మోపూర్ గ్రామంలో శంకర నేత్రాలయ కంటి వైద్యశాల-చెన్నై, మరియు కాటంరెడ్డి ప్రసాద్‌రెడ్డి-శోభారెడ్డి (యుఎస్‌ఏ)ల సౌజన్యంతో ఉచిత కంటి వైద్యశిబిరం ప్రారంభమైంది. ఈనెల 30వ తేదీ వరకు నిర్వహించే ఈ శిబిరాన్ని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కంటి సమస్యలున్నవారికి ఈ శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రత్యేకించి కంటి శుక్లాల ఆపరేషన్లు కూడా నిర్వహిస్తారన్నారు. ఏడు రోజుల పాటు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి చికిత్స అందిస్తున్న శంకర నేత్రాలయ-చెన్నై యాజమాన్యానికి, వైద్యులకు..మరియు కాటంరెడ్డి ప్రసాద్ రెడ్డి, కాటంరెడ్డి శోభారెడ్డిలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి ఆకాంక్షల మేరకు ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలని ఆయన వైద్యులకు సూచించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి 'నారా లోకేష్ ఆరోగ్య రక్ష' కార్యక్రమాన్ని నెల్లూరురూరల్ నియోజకవర్గంలో ఇప్పటికే అనేక ప్రాంతాలలో ఏర్పాటుచేసి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని ఆయన తెలిపారు. ఆ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న యువనేత నారా లోకేష్‌కి, ఆరోగ్యరక్ష కన్వీనర్ దాట్ల చక్రవర్ధన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్‌కుమార్ యాదవ్, క్లస్టర్ ఇంచార్జ్ జలదంకి సుధాకర్, నెల్లూరు రూరల్ మండలం ఎమ్మెల్యే కార్యాలయం ఇంచార్జ్ వేమిరెడ్డి సురేందర్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, మండల కో-ఆప్షన్ నెంబర్ మీరా మొహిద్దీన్, టీడీపీ నాయకులు రాపూరు శేఖర్, చెన్నారెడ్డి సురేందర్‌రెడ్డి, చెన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, మనవరపు భాస్కర్, అన్నం సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జగన్ అరెస్టు తప్పటడుగు అవుతుందా!

(మొదటిపేజీ తరువాయి)

వినిపిస్తోంది. సూపర్ సిక్స్ అమల్లో ఫెయిల్. యోగాంధ్రలో 300 కోట్లు హాంఫట్ అంటూ, కూటమి ఏడాది పాలనపై పెద్ద ఎత్తున విమర్శనాస్త్రాలు సంధిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుల జోరును అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం కేసులనే అస్త్రాలని ప్రయోగిస్తోంది. అదే సమయంలో పాలనలో రాష్ట్రాభివృద్ధికి సంబంధించి 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ విజయాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేయాలని నిర్ణయించింది. ఇక యోగాంధ్ర పేరుతో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కూడా విజయవంతం చేశామని చెబుతోంది. సరిగ్గా ఇలాంటి సమయంలోనే పరామర్శలు, పర్యటనల పేరుతో జగన్ జిల్లాలు తిరుగుతుండడంతో ఏపీ రాజకీయాలు రసకందాయంలో పడుతున్నాయి. ఆత్మహత్య చేసుకున్న తమ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు ఇటీవల జగన్ పల్నాడు జిల్లా రెంటపాళ్లకు వెళ్లారు. పోలీసులు కేవలం 3 వాహనాల కాన్వాయ్‌కి, 100మంది నాయకుల కార్యకర్తలకి మాత్రమే అనుమతి ఇచ్చారు. అయితే, వందల సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు రావడంతో తొక్కిస లాట, ఉద్రిక్తత చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో తీవ్రంగా గాయపడి ఇద్దరు కార్యకర్తలు మరణించారు. ఇందులో సింగయ్య అనే వృద్ధుడు జగన్ వెళ్తున్న వాహనం కిందపడి మృతి చెందాడని కూటమి సర్కారు, పోలీసు యంత్రాంగం ఆరోపిస్తోంది. ఈమేరకు వాహన డ్రైవర్, జగన్‌తో పాటు అంబటి రాంబాబు, విడుదల రజిని తదితరులపై కేసు నమోదు చేశారు. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్ష నాయకుడి పర్యటన సమయంలో సెక్యూరిటీ బాధ్యత ప్రభుత్వానిదే అయినా, దాన్ని విస్మరించి తగినంత మంది పోలీసు సిబ్బందిని కూటమి ప్రభుత్వం నియమించలేదనే వాదనలూ వినిపిస్తున్నాయి. అదే సమయంలో పల్నాడుపై దండ్రయాత్ర తరహాలో పోలీసు సూచనలను, నిబంధనలను ఉల్లంఘించి జగన్ తీవ్ర తప్పిదానికి పాల్పడ్డారనే ఆరోపణలు వినవస్తున్నాయి. జగన్ ప్రైవేటు సెక్యూరిటీ సైతం ఇష్టారాజ్యంగా కార్యకర్తలను, ప్రజలను తోసివేసిందనే విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి.

### పోటాపోటీ ప్రకటనలతో ఉత్కంఠ..

కాగా, అక్రమ కేసులతో తమ మనో స్థైర్యాన్ని దెబ్బతీయలేరని జగన్ కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తాను తమ పార్టీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. ఒక మాజీ ముఖ్యమంత్రిగా తనకు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత కాదా అని నిలదీశారు. పైగా తాము అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు, పవన్ కల్యాణ్ పర్యటలను అడ్డుకోలేదంటూ పేర్కొన్నారు. తమ కార్యకర్త మరణిస్తే పార్టీ నుంచి సాయం కూడా ప్రకటించవామని, అలాంటి తనపై తప్పుడు కేసు పెట్టడం కూటమి కుతంత్రాలకు పరాకాష్ట అని ఆరోపించారు. అయితే దీనిపై కూటమి పార్టీల నాయకులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో జరిగిన విషయాలను జగన్ మరిచిపోయినట్లున్నారని విమర్శిస్తున్నారు.

### వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ దుశ్చర్యలు.. లెక్కలేనన్ని..

గత ప్రభుత్వ హయాంలో పల్నాడు జిల్లా ఆత్మకూరులో తెలుగుదేశం నాయకులను ఊరి నుంచి వెలివేసిన ఘటనలు, కార్యకర్తలను పరామర్శించేందుకు చంద్రబాబు వెళ్లకుండా ఆయన ఇంటికి తాళ్లు కట్టడం జగన్‌కు గుర్తులేదా అని టీడీపీ నాయకులు ప్రశ్నించారు. విశాఖ ఎయిర్‌పోర్టులో చంద్రబాబును నిర్బంధించడం, తిరుపతి స్థానిక సంస్థల ఎన్నికల్లో అక్రమాలను ప్రశ్నించేందుకు వెళ్ళినప్పుడు పోలీసులు అడ్డుకోవడంతో చంద్రబాబు రేణిగుంటలో నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేయడం మరిచారా? అని ధ్వజమెత్తారు. విజయవాడకు వస్తున్న పవన్ కల్యాణ్‌ను జగ్గయ్యపేట వద్ద నిలువరించడం. అచ్చెన్నాయుడిని అరెస్టు చేసి 800 కిలోమీటర్లు తరలించడం ఎంత ఘోరమో జగన్ ఒక్కసారి గుర్తుకి తెచ్చుకోవాలన్నారు. కనీస మానవత్వం లేకుండా తన వాహనం కిందపడిన వృద్ధుడిని పరామర్శించకుండా వెళ్లిన జగన్ నీతులు చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని సీఎం చంద్రబాబు విమర్శించారు. ఇక జగన్ పర్యటన సమయంలో కొందరు 2029లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర పార్టీల నాయకులను "రప్పారప్పా నరుకుతాం", " తొక్కుకుంటూ వెళ్తాం" అంటూ పుష్పా సినిమా డైలాగ్‌లను పోస్టర్లుగా ప్రదర్శించడంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతిభద్రతల సమస్యలు సృష్టించేవారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. తమది మంచి ప్రభుత్వమే కానీ తప్పును మన్నించే ప్రభుత్వం కాదని తేల్చిచెప్పారు. ఇదే సమయంలో రెంటపాళ్ల ఘటనకు జగన్ బాధ్యత వహించాలని, కనీస మానవత్వం లేని నాయకుడు జగన్ అంటూ ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, అన్న వదిలేసిన బాణం అయిన షర్మిల వ్యాఖ్యానించడం గమనార్హం.

### అరెస్టు తథ్యమా..?

కాగా, రెంటపాళ్ల ఘటనలో వృద్ధుడి సింగయ్య మృతి విషయంలో జగన్‌పై నమోదైన కేసు విషయంలో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే పోలీసులు కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఇక జగన్‌కు సైతం నోటీసులు ఇచ్చారు. అయితే, ఈ సంఘటన అడ్డంపెట్టుకుని జగన్‌ను అరెస్టు చేస్తే అది ఇప్పటివరకు స్తబ్దుగా ఉన్న వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా మారే అవకాశం కూడా ఉందని కూడా ప్రచారం సాగుతోంది. ఇక యాక్సిడెంట్ చేస్తే డ్రైవర్‌పై కేసు నమోదు చేస్తారుకానీ, కారులోని వారందరిపై ఎఫ్ఐఆర్ పెట్టడం ఎంతవరకు సమంజసం అని కొందరు ప్రశ్నిస్తున్నారు. అలా అయితే బస్సు యాక్సిడెంట్ అయితే బస్సులోని ప్రయాణికులందరిపై కూడా కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు. అయితే ఉద్దేశపూర్వకంగానే సింగయ్య మృతికి కారకులని తేలితే నిందితులకు యావజ్జీవ శిక్ష పడే అవకాశం ఉందని న్యాయనిపుణులు భావిస్తున్నారు. ఏదేమైనా జగన్‌పై కేసు వాస్తవమా? కుట్రకోణమా? కాలమే తేల్చనుంది.

అయితే, ఇప్పటికే పదుల సంఖ్యలో ఈడీ, సిబిఐ కేసులని ఎదుర్కొంటూ పదేళ్ళుగా బెయిలుపై బయటున్న వైసీపీ అధినాయకుడిని ఇలాంటి పెట్టీ కేసులో అరెస్టుచేస్తే అది కూటమికే నష్టమని విశ్లేషకులు అంటున్నారు.

గత అయిదేళ్ల జగన్ విధ్వంస పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలని బట్టబయలు చేసి జగన్ని అరెస్టు చేయాలి తప్ప, ఇలాంటి పెట్టీ కేసులతో అదుపులోకి తీసుకుంటే కూటమి ప్రభుత్వం అబాసుపాలు కావడం ఖాయం అన్న భావనని విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. నిజంగా జగన్ని అరెస్టు చేయాలనుకుంటే లోతుగా పరిశీలిస్తే మద్యం కుంభకోణం ఒక్కటి చాలని విశ్లేషకులు అభిప్రాయపడడం ఇక్కడ గమనార్హం. కొందని తప్పి ఎలుకని పట్టినట్లుగా స్కిల్ స్కాము నెపంతో చంద్రబాబుని అరెస్టుచేసి అప్పటి అధికార వైసీపీ 2024 ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకుంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అలాంటి తప్పిదానికి పాల్పడితే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీ చేతిలో చావు దెబ్బ తినడం ఖాయం అన్నది విశ్లేషకుల నుండి వినిపిస్తున్న మాట.

## ఆదిశంకర ధ్యానమందిరంలో..

# నేత్రపర్వంగా.. జ్యేష్ఠ మాస రుద్రాభిషేకాలు



జ్యేష్ఠ మాసం శివరాత్రి సందర్భంగా ఇటీవల నెల్లూరులోని శ్రీ ఆదిశంకర ధ్యాన మందిరంలో ఎంతో భక్తి శ్రద్ధలతో మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, శంకర భగవత్పాదుల అర్చనలు ఘనంగా జరిగాయి. ధ్యాన మందిరం అధ్యక్షులు.. రాష్ట్ర బ్రాహ్మణ సంఘం నాయకులు పొరా గురువేంకట శ్రీధరశర్మ ఉభయ దాతలుగా వ్యవహరించిన ఈ కార్యక్రమానికి పవని అనిల్‌కుమార్‌శర్మ అర్చకులుగా వ్యవహరించారు. మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనంద్‌కుమార్, మేనేజర్ చక్రాల వెంకట లక్ష్మీనరసింహం, తంగిరాల వెంకట శ్రీకాంత్ శర్మ, గన్నవరం ప్రభాకర్‌శర్మ అభిషేకాలను నిర్వహించారు. అన్నవరం సత్యనారాయణ లక్ష్మీ సుజాత, నాగరత్నకుమారి, కనపర్తి దుర్గా కృష్ణకుమార్, డాక్టర్ సుదర్శనరెడ్డి కుటుంబం, గట్టుపల్లి పద్మ, రాయప్రోలు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. ట్రస్టీ చక్రాల ఆనందకుమార్ మాట్లాడుతూ, ఈ మందిరంలో మాస శివరాత్రి రుద్రాభిషేకం ప్రారంభించి రెండు సంవత్సరాలు పూర్తయి, నేడు తృతీయ వార్షికోత్సవం జరుపుకున్నామని, అందుకు సహకరించినవారికి, దాతలకీ కృతజ్ఞతలు తెలిపారు. ఆషాఢమాసంలో రెండవ ఆదివారం జులై 8న తొలిఏకాదశి సందర్భంగా సామూహిక విష్ణు సహస్రనామం, లలితా సహస్రనామం, స్తోత్ర పారాయణం నిర్వహిస్తామని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా ప్రపంచ సంగీత దినోత్సవం



ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం, ఎస్.ఆర్.ఆర్. చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లోని రవీంద్రభారతి హాలులో పలువురు ప్రముఖులకు పురస్కారాలు అందజేశారు. ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ నాయకులు పేరాల శేఖర్‌రావు, ఏబీవీపీ మాజీ ప్రెసిడెంట్ డాక్టర్ పి.మురళీమనోహర్ పాల్గొని మాట్లాడుతూ, సంగీతానికి ఎల్లలు లేవని..జాతి,కుల,మత, ప్రాంత, భేదాలు ఉండవని, మనుషుల్ని కలిపే శక్తి సంగీతానికి ఉంటుందని అన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న టి.శుభాకర్ రావు, డాక్టర్ ఆమంచ అంజయ్య, జి.ఎల్.వీరాంజనేయులు, ఎల్.అనురుద్రరెడ్డి, డాక్టర్ బి.గంగాధర్ రెడ్డి, ఎ.మధుసూధన్, లయన్ డాక్టర్ మేడిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. తొలుత, కవి సమ్మేళనం, సాంస్కృతిక ప్రదర్శనలు వేడుకగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులు కె.మురళీ మోహన్‌రాజు, మారంరాజు రామచంద్ర రావు, డాక్టర్ రాధ కుసుమ, వి.వి.మహేశ్వర రావు, డాక్టర్ ఎస్.రామచంద్ర రావు, రసపుత్ర రజని, కవులు, కళాకారులు, సంగీత ప్రియులు తదితరులు పాల్గొన్నారు.



## దినేష్‌రెడ్డితో..డైరెక్టర్ సమావేశం

### - పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణపై చర్చ -

పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణపై విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఇఎంసిఎల్) కార్యాలయంలో ఇటీవల సమావేశం జరిగింది. ఆ సంస్థ డైరెక్టర్ శరవణన్ ప్రత్యేకంగా ఛైర్మెన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి చాంబర్‌కి వెళ్ళి ఆయనతో సమావేశమయ్యారు. కార్పొరేషన్ ప్రస్తుత పనితీరు, పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ, కీసైక్లింగ్ యూనిట్లు మరియు వాహనాల జీపీఎస్ ట్రాకింగ్ వంటి కీలక అంశాలపై సమీక్షించారు. పారిశ్రామిక వ్యర్థాల వాహనాల పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా చేసేందుకు ప్రత్యేక మొబైల్ యాప్ అభివృద్ధి చేయాలని ఈ సమావేశంలో వారు నిర్ణయం తీసుకున్నారు. కార్పొరేషన్ అభివృద్ధి చెందే దిశగా, రాష్ట్ర ప్రభుత్వానికి గౌరవం తెచ్చే విధంగా ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలన్నదే తమ అభిమతమని ఈ సందర్భంగా దినేష్‌రెడ్డి తెలిపారు.

## వేడుకగా..రెవెన్యూ డే!



నెల్లూరు జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఇటీవల రెవెన్యూ డే వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఈ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన సేవలందించి రెవెన్యూ వ్యవస్థ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని పిలుపునిచ్చారు. దశాబ్దాల తరబడిగా ప్రజలతో నేరుగా సత్సంబంధాలు కలిగిన ఏకైక శాఖ రెవెన్యూశాఖ అని, ఉద్యోగులందరూ బాధ్యతగా పనిచేసి రెవెన్యూ శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. రెవెన్యూ అసోసియేషన్‌కు ఒక గెస్ట్‌హౌస్‌ను ఏర్పాటుచేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన చెప్పారు. వచ్చేనెలలో 11, 12, 13 తేదీల్లో రెవెన్యూ స్పోర్ట్స్ నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ, ప్రజలకు పలు రకాల సర్టిఫికెట్లను జారీ చేయడంలో రెవెన్యూశాఖ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం రెవెన్యూ అంశాలపై పూర్తి సమాచారంతో తయారుచేసిన రెవెన్యూ అకాడమీ వెబ్‌సైట్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. రెవెన్యూశాఖలో విశిష్ట సేవలందించిన పలువురు ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంతోకాలంగా కలెక్టరేట్ పాత్రికేయుడిగా పనిచేస్తున్న వేలమూరు శ్రీధర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కర్‌రావు, కలెక్టరేట్ ఏఓ విజయ కుమార్, జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అల్లంపాటి పెంచలరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ మురళి, సెక్రటరీ డానియేల్ పీటర్ తదితరులు పాల్గొన్నారు.

## 'అన్న క్యాంటీన్'కి స్థల పరిశీలన

మండల కేంద్రమైన ముత్తుకూరులో బస్టాండ్ పరిసరాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈనెల 24న మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జునయాదవ్, నాయకులు బొలిగర్ల శ్రీనివాసయాదవ్, శ్రీధర్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి తదితరులు అధికారులుతో కలసి స్థల పరిశీలన జరిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార స్వప్న, ఎంపీడీఓ నాగమణి, పంచాయతిరాజ్ విస్తరణాధికారి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15లోపు.. గిరిజనులకు ఆధార్‌కార్డులు

### • రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి



జిల్లాలో ఆధార్, రేషన్ కార్డులు లేని గిరిజనులకు వచ్చే ఆగస్టు 15 లోపు వాటిని అందిస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమం, స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఈనెల 25న ఆమె జిల్లాలో పర్యటించారు. గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. ఇటీవల పలువురి చిత్రహింసలతో గాయపడి కోలుకుంటున్న చిన్నారిని ఆసుపత్రికి వెళ్ళి మంత్రి పరామర్శించారు. అనంతరం నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలకు ఆధార్ కార్డు, రేషన్ కార్డులు మూలాధారమని, మైదాన ప్రాంతమైన ఈ జిల్లాలో ఇప్పటికీ అమాయక గిరిజనులకు ఆ కార్డులు లేకపోవడం భాధాకరమన్నారు. వెంటనే ఆధార్, రేషన్ కార్డులను వారి ఇళ్ల వద్దకే వెళ్లి అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించామన్నారు. అదేవిధంగా మారుమూల పల్లెల్లో త్రాగునీరు, సాగునీరు మౌలిక వసతుల కల్పన ఐటీడీఏల ప్రథమ కర్తవ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో గిరిజన అభివృద్ధికి గత సంవత్సరం 1300 కోట్ల నిధులు వ్యయం చేశామన్నారు. అలాగే ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం ద్వారా 206 రోడ్లకు 550 కోట్ల నిధులు ఖర్చు చేయడం జరిగిందన్నారు. నెల్లూరు ఐటీడీఏ పరిధిలోని కావలి, తిరుపతి, కె.వి పల్లి తదితర ప్రాంతాల్లోని గురుకుల పాఠశాలల అభివృద్ధికి దాదాపు 18 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశామన్నారు. గురుకుల పాఠశాలల్లోని 12 మంది విద్యార్థులు మెడికల్ సీట్లు, ఏడుగురు విద్యార్థులు ఐఐటీలలో సీట్లు సంపాదించడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలోని అన్ని గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో త్రాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశామన్నారు. పేద గిరిజనులు వెనుకబడిన తెగలుగా మిగిలిపోకుండా వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించి పైకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం ఆపేసినటువంటి 16 గిరిజన సంక్షేమ పథకాలను పునరుద్ధరించామన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రితో చర్చించి, యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## అయ్యవారంటే..ఇలా ఉండాలి!



'గురువులందు సద్గురువులు వేరయా' అన్నట్లు.. అయ్యవార్లలో కూడా మంచి అయ్యవార్లు ఎందరో ఉన్నారు. నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం చుంచులూరు గ్రామంలో ఇటీవల ఓ అయ్యవారు. (పేరు అశోక్) బదిలీ అయి.. ఆ పాఠశాలను విడిచిపెట్టి పోతుంటే అక్కడున్న బాలికలంతా బోరుమంటూ ఏడ్చారు. మా అయ్యవారు వెళ్లిపోతున్నారే..అంటూ ఎంతో బాధపడ్డారు. తొమ్మిదేళ్ళపాటు ఆ పాఠశాలలో బాలికలకు ఎంతో శ్రద్ధతో విద్యాబుద్ధులు నేర్పిన ఆ అయ్యవారికి పాఠశాలలో చిరు సన్మానం జరిగితే, ఆ వీడ్కోలు సభలో పాల్గొని వెళ్ళిపోతున్న ఆ అయ్యవారికి అక్కడున్న బాలికలంతా బిగ్గరగా రోదిస్తూనే కాళ్ళకు దండాలు పెట్టారు. ఆ అయ్యవారు కూడా వారి ఆత్మీయతకు చలించిపోయి భావోద్వేగంతో కన్నీరు పెట్టుకుంటూ అక్కడనుంచి వెళ్ళలేక.. వెళ్ళిపోయారు. అయ్య వార్లంతా కూడా అవాక్కయ్యారు. ప్రసార మాధ్యమాల్లో ఆ వీడియోని చూసి, అందరి కళ్ళూ చెమర్చాయి. అయ్యవార్ల పట్ల పిల్లల్లో ఇంత అభిమానం దాగుంటుందా అని జనం కూడా ఆశ్చర్యపోయారు. అయ్యవారంటే అలా ఉండాలి..అనుకున్నారు.

## కావలి వద్ద.. 3 లక్షల గంజాయి స్వాధీనం

### • ఇద్దరు అరెస్ట్

రైళ్లలో అక్రమంగా గంజాయిని తరలించే ఇద్దరు నిందితులను ఇటీవల కావలి రైల్వే పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు మూడు లక్షల రూపాయల విలువచేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రైల్వే డీఎస్పీ జి.మురళీధర్ విలేకర్లతో మాట్లాడుతూ, రైల్వే డీఐజీ ఏసుబాబు ఆదేశాల మేరకు నెల్లూరు రైల్వే సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో నెల్లూరు, గూడూరు, కావలి రైల్వే స్టేషన్‌ల పరిసరాల్లో తనిఖీలు నిర్వహించామని, కావలి రైల్వేస్టేషన్‌కు ఉత్తరం వైపున బ్యాగ్‌లతో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని గుర్తించి బ్యాగ్‌లను తనిఖీ చేయగా, వాటిలో 8 ప్యాకెట్లలో గంజాయి కనిపించిందన్నారు. వారిలో ఒకరు తమిళనాడు, మరొకరు బీహార్‌కి చెందినవారిగా గుర్తించి అరెస్ట్ చేశామన్నారు. రైళ్ళలో గంజాయి తరలింపుపై గట్టి నిఘా పెట్టామన్నారు. రైళ్లలో దొంగతనాలు జరగకుండా, పయాణీకుల భద్రత కోసం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీఐ సుధాకర్‌రావు, కావలి, నెల్లూరు జీఆర్పీ ఎస్ఐలు రమాదేవి, మాలకొండయ్య, హరిచందన, కావలి ఆర్పీఎఫ్ ఎస్ఐ సుబ్బారావు, బీఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...



### ఉదయగిరిలో పన్నుల వసూళ్ళకు సూచనలు

ఉదయగిరి మండలంలోని పంచాయతీల్లో సకాలంలో పన్నుల వసూళ్ళకు పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు డీఎల్‌పీఓ సలీం కార్యదర్శులకు చెప్పారు. ఇటీవల ఆయన మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్ పంచాయతీలను సందర్శించారు. డిప్యూటీ ఎంపీడీఓ కరిముల్లా, కార్యదర్శులు వెంకటరమణ, వీరేంద్ర పాల్గొన్నారు.

### ఉప్పలపాడు వద్ద హైవేపై వాహనాల తనిఖీ

అనంతసాగరం మండలంలోని ఉప్పలపాడు హైవేపై ఈనెల ఆర్‌టీఓ రాములు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. వాహన పత్రాలను పరిశీలించి, ట్రాఫిక్ నియమ నిబంధనలు వారికి తెలియజేశారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని చెప్పారు. అతి వేగం పనికిరాదని హెచ్చరించారు.

### తరుణవాయి విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

సంగం మండలం తరుణవాయి జడ్పీ స్కూల్ విద్యార్థులకు టీడీపీ నాయకుడు బాణా శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 23న యూనిఫాం, పుస్తకాలు పంపిణీ చేశారు. నీటి సంఘం అధ్యక్షులు బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తదితరులు పాల్గొని విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలు సాధించాలని ఆకాంక్షించారు.

### తోటపల్లిగూడూరులో సర్వేయర్ల వినతి

తోటపల్లిగూడూరు మండలంలోని సచివాలయాల్లో గ్రామ సర్వేయర్లుగా పనిచేస్తున్న తమ సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని కోరుతూ ఈనెల 23న తహశీల్దార్ బూదూరు పద్మావతికి పలువురు సర్వేయర్లు వినతిపత్రం సమర్పించారు. రీసర్వేలో పాల్గొంటున్న సర్వేయర్ల సమస్యలు తీర్చాలని వారు విజ్ఞప్తి చేశారు.

### జమ్మిపాళెం వద్ద రోడ్డుప్రమాదం.. ఒకరి మృతి

కోవూరు మండలం జమ్మిపాళెం వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైకిల్‌ను వేగంగా వస్తున్న మినీ వ్యాన్ ఢీకొని నెల్లూరుకు చెందిన సుధీర్‌కుమార్ అనే యువకుడు మృతిచెందాడు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే కోవూరు ఎస్ఐ రంగనాథగౌడ్, పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి, మృతదేహాన్ని పోస్టుమార్టమ్‌కు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### దగదర్తిలో గ్రావెల్ తరలింపుపై ఫిర్యాదు

దగదర్తిలో రాత్రివేళల్లో కొందరు ఎలాంటి అనుమతులు లేకుండానే టిప్పర్లతో గ్రావెల్‌ను తరలిస్తున్నారంటూ సీపిఎం నాయకులు జి.రమేష్, సుధాకర్, మాల్యాద్రి తదితరులు తహశీల్దార్ పి.కృష్ణకు ఇటీవల ఫిర్యాదుచేశారు. టిప్పర్ల రాకపోకలతో పక్కనే ఉన్న గిరిజనుల కాలనీ అంతా దుమ్ము నిండిపోతోందని, అక్రమంగా గ్రావెల్ తరలిస్తుండడాన్ని నిరోధించాలని కోరారు.

### చేవూరులో ఉపాధ్యాయురాలికి సన్మానం


గుడ్లూరు మండలం చేవూరు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీ అయిన ఎం.పద్మను ఈనెల 23న పాఠశాలలో ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొని పాఠశాలకు గత రెండు సంవత్సరాల్లో ఆమె చేసిన విద్యాభివృద్ధిని మెచ్చుకున్నారు.

### అప్పసముద్రంలో రైతులకు అవగాహన

ఉదయగిరి మండలంలోని అప్పసముద్రం గ్రామంలో ఈనెల 24న 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారులు పాల్గొని రైతులకు పలు రకాల పంటల సాగులో అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారులు వినోద్, విఏఏలు స్రవంతి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### పాలిచెర్లపాడులో ఆశా వర్కర్ పోస్టు ఖాళీ

వెంకటాచలం మండలం పాలిచెర్లపాడు గ్రామంలో ఆశా వర్కర్ పోస్టు ఖాళీగా ఉందని, ఆసక్తి కలవారు దరఖాస్తు చేసుకోవచ్చని కసుమూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి ప్రవల్లిక ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై, 45ఏళ్ళలోపు వయసు ఉండాలని సూచించారు.



# జయహో శుభాంశు

## రోదసిలోకి.. మన అ'ద్వితీయ' భారతీయుడు

- భారత అంతరిక్ష చరిత్రలో నూతనాధ్యాయం
- కీలకమైన డాకింగ్ ప్రక్రియ విజయవంతం
- అంతరిక్ష కేంద్రంలోకి అడుగుపెట్టిన శుభాంశు

*ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అద్వితీయ ఘట్టం ఎట్టకేలకు కళ్ళముందు సాక్షాత్కారించింది. భారతీయుల మనసులను ఆనందపరవశుల్ని చేసే సన్నివేశం..ఏళ్ళ నాటి కల..సాకారమైంది. అంతరిక్ష యాత్రలో భాగంగా, మన భారత వైమానిక దళ ఫైటర్ పైలట్..వ్యోమగామి..శుభాంశు శుక్లాకి చోటు లభించడం, ఈనెల ఆయన రోదసిలోకి దూసుకువెళ్ళి, మరో ముగ్గురు వ్యోమగాములతో కలిసి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి పరిశోధనలు చేయనుండడం భారతీయులకు దక్కిన అపురూప గౌరవం. 1984లో రాకేష్‌శర్మ అంతరిక్ష యాత్ర తర్వాత, భారతదేశం నుంచి మరో భారతీయుడైన శుభాంశు శుక్లాకి ఆ ఘనత దక్కడం భారత అంతరిక్ష చరిత్రలోనే ఒక నూతనాధ్యాయం!.. గురువారం మధ్యాహ్నం 4.30 గంటల ప్రాంతంలో శుభాంశు అంతరిక్షంలోని అంతరిక్ష కేంద్రంలోకి అడుగు పెట్టడంతో భారతీయుల హృదయాలు అనందంతో ఉప్పొంగిపోయాయి. భారతీయులంతా జయహో!..శుభాంశు!..నీకు జయమగు గాక!.. శుభాంశు నీకు శుభమగు గాక!.. అని నిండుమనసుతో దీవించారు.*

భారతీయుల కలలకు ప్రతిరూపంగా శుభాంశు శుక్లా.. భారత కాలమానం ప్రకారం ఈనెల 25న బుధవారం మధ్యాహ్నం.. 12.01 గంటలకు ఫ్లోరిడా (అమెరికా)లోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి బయలుదేరారు. శుభాంశుతో సహా నలుగురు వ్యోమగాములతో కూడిన 'క్రూ డ్రాగన్' వ్యోమనౌకను మోసుకుంటూ స్పేస్ ఎక్స్ ఫాల్కన్ రాకెట్ నింగిలోకి దూసుకుపోయింది. కొద్ది నిమిషాలకే వ్యోమనౌక రాకెట్ నుంచి విడివడి నిర్ధేశిత భూకక్ష్యలోకి చేరింది. అక్కడ నుంచి షెడ్యూలు ప్రకారం 28 గంటల ప్రయాణం తర్వాత ఈనెల 26, గురువారం సాయంత్రం 4.30గంటలకు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోని హార్మోనీ మాడ్యూల్‌తో అనుసంధానమయ్యే విధంగా ఏర్పాట్లు చేశారు.

### అంతరిక్ష కేంద్రంలోకి అడుగుపెట్టిన శుభాంశు :

యాక్సియం-4 మిషన్‌లో భాగంగా ఈ రోదసియాత్ర నిర్ణీత సమయానికి ఎంతో కీలకమైన డాకింగ్ ప్రక్రియ దిగ్విజయంగా పూర్తి చేసుకుంది. దీంతో ఉత్కంఠభరితమైన ఈ సాహసయాత్ర ప్రపంచ మానవాళినంతా అబ్బురపరచింది. డాకింగ్ ప్రక్రియ అనుకు న్నట్లుగానే సజావుగా జరగడంతో వ్యోమగాములు నేరుగా అంతరిక్షంలోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి అడుగుపెట్టారు. ఈ శుభ సన్నివేశం కోసమే ప్రపంచమంతా ఎదురుచూసింది. దీంతో వ్యోమగాములకు ప్రపంచవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తాయి. దీంతో రోదసిలోని అంతరిక్ష కేంద్రానికి వెళ్ళిన తొలి భారతీయ వ్యోమగామిగా కూడా శుభాంశు శుక్లా చరిత్ర సృష్టించాడు. ఇక అక్కడినుంచి శుభాంశు శుక్లా తమతో పాటు వచ్చిన అమెరికా, పోలెండ్, హంగరీలకు చెందిన ముగ్గురు వ్యోమగాములతో కలసి పరిశోధనలు చేస్తారు. ఈ వ్యోమ గాములు అంతరిక్ష కేంద్రం నుంచి 14 రోజుల పాటు అంతరిక్షానికి సంబంధించి 60 అద్భుతమైన ప్రయోగాలు చేయనున్నారు. అంతరిక్షం నుంచే శుభాంశు శుక్లా ప్రధాని మోడీతో కూడా మాట్లాడనుండడం మరో విశేషం. 'తన రోదసి యాత్రకు ఇది ప్రారంభం మాత్రమే కాదని, భవిష్యత్తులో భారత్ చేపట్టబోయే మానవ సహిత రోదసి యాత్రలకు ఇది నాంది' అని శుభాంశు భారత ప్రజలను ఉద్దేశించి భూకక్ష్య నుంచి మాట్లాడడం విశేషం.

### శుభం..శుభాంశు - తల్లితండ్రుల దీవెన

భారత్‌లోని లఖ్‌నవూలో శుభాంశు చదువుకున్న సిటీ మాంటిస్సోరి స్కూల్ నుంచి తల్లితండ్రులతో వర్చువల్‌గా దీవెనలందుకుని శుభాంశు రోదసిలోకి తన అద్వితీయ ప్రయాణం ప్రారంభించడం విశేషం. ఈ సందర్భంగా తల్లితండ్రులు శుభాంశు యాత్ర జయప్రదం కావాలని ఆశిస్తూ దీవించారు. శుభాంశు శుక్లా ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవూలో 1985 అక్టోబరు 10న జన్మించాడు. 2006లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఫైటర్ వింగ్‌లో చేరి అనేక రకాల విమానాలను అద్భుతంగా నడిపారు. 2024లో గ్రూప్ కెప్టెన్ అయ్యారు. తన ప్రజ్ఞాపాటవాలతో ఎన్నో అవార్డులు, పతకాలు సాధించారు కూడా. భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టబోయే మానవ సహిత అంతరిక్ష యాత్రకు సంబంధించి తుదిజాబితాలో చోటుచేసుకున్న నలుగురు వాయుసేన అధికారుల్లో శుభాంశు ఒకరు. ఆ తర్వాత రష్యాలోని యూరీగగారిన్ కాస్మోనాట్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆయన వ్యోమగామి శిక్షణ పొందారు. ఈ అంతరిక్ష యాత్ర సందర్భంగా తొలుత ఆయన తల్లితండ్రుల ఆశీస్సులను అందుకున్నారు.

ఏదేమైనా అంతరిక్షయాత్రలో చరిత్ర సృష్టిస్తున్న మన శుభాంశు అన్ని పరిశోధనలు దిగ్విజయంగా పూర్తిచేసుకుని అంతరిక్ష పరిజ్ఞానంలో భారత్ కీర్తిపతాకను మరింతగా రెపరెపలాడిస్తూ.. భారత ప్రతిష్టను జగజ్జేగీయమానం చేస్తారని ఆశిద్దాం!..

**జయహో!..శుభాంశు..జయహో!...**

# వైకాపాకి దయ, జాలి వంటివేమీ ఉండవు!

## సింగయ్యది ముమ్మాటికీ హత్యే
## జాతీయ ఎస్సీ కమిషన్ రంగంలోకి దిగాలి

**- మాజీమంత్రి సోమిరెడ్డి డిమాండ్**



దళితుల ప్రాణాలు తీయడం వైకాపాకి అలవాటే నని, ఆ పార్టీ వారికి జాలి దయ వంటివేమీ ఉం డవని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు.. మాజీ మంత్రి, సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. నెల్లూరు టీడీపీ కార్యాలయంలో ఈనెల 25న నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైకాపా అధినేత వైఎస్ జగన్‌పై, వైకాపా నాయకుల తీరుపై ఆయన విరుచుకుపడ్డారు. గతంలో డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం, ఉదయగిరి నారాయణ, దుగ్గిరాల కరుణాకర్.. ఇప్పుడు సింగయ్య చనిపోయారని, ఆ దళిత కుటుంబాలను జగన్ కానీ, వైకాపా నాయకులు కానీ పరామర్శించలేదని, కానీ బెట్టింగ్‌లో నష్టపోయిన ఓ వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించాలనే పేరుతో ర్యాలీ నిర్వహించి మరో మూడు ప్రాణాలను బలి తీసుకున్నా రని ఆయనన్నారు. జగన్‌రెడ్డి లాంటి వ్యక్తులకు దళితులు, గిరిజనుల ప్రాణాలంటే లెక్కలేకుండా పోతోందని, దళిత సోదరుడు సింగయ్యది జగన్‌రెడ్డి చేసిన హత్యేనని, దీనిపై జాతీయ ఎస్సీ కమిషన్ జోక్యం చేసుకుని చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. వేలకోట్ల మద్యం కుంభకోణంలో వెలుగుచూస్తున్న నిజాలను పక్కదారి పట్టించడానికే జగన్ నీచరాజకీయాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. వైసీపీ పేరు ఇక 'రప్పా..రప్పా పార్టీ' అని, దాని ఎన్నికల గుర్తు గొడ్డలిని పెట్టుకోవాలని ఆయన అంటూ, సైకో మనస్తత్వం కలిగిన జగన్ రెడ్డి పార్టీకి అవే కరెక్ట్ అన్నారు. పోలీసు ఆంక్షలను ఉల్లంఘించి చేపట్టిన ర్యాలీలో సింగయ్య మెడను కారు కింద నలిపేశారని, సాటి మానవుడి ప్రాణం పోతుందనే కనికరం కూడా లేకుండా సింగయ్య శరీరాన్ని లాగి పక్కన పడేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'జగన్ రెడ్డి కార్యక్రమానికి పోలీసులు అనుమతి ఇచ్చింది రెంటపాళ్లలో..అది కూడా 3 కార్లు..వంద మందికి. కానీ, 9 గంటల సేపు 80 కిలోమీటర్ల మేర ర్యాలీ నిర్వహించి ముగ్గురు ప్రాణాలను బలితీసుకున్నాడు' అని ఆయన ఆరోపిం చారు. బెట్టింగ్‌లో నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న ఓ వ్యక్తి విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు మాజీ సీఎం వెళ్లడం కంటే దుర్మార్గం మరొకటి లేద న్నారు. 'గంగమ్మ జాతరలో పోతును నరికి నట్టు టీడీపీ కార్యకర్తలను రప్పా రప్పా నరికేస్తామనడం' తప్పుకాదని సమర్థించు కోవడం జగన్‌రెడ్డికే చెల్లిందన్నారు. జగన్‌రెడ్డి భద్రత కోసం ఆ కార్యక్రమంలో ప్రభుత్వం 679 మంది పోలీసులను నియమించిందని ఆయన అంటూ, జెడ్ ప్లస్ కేటగిరి భద్రతలో ఉండే చంద్రబాబునాయుడుపై గతంలో పుంగనూరులో రాళ్లు వేయించడమే కాక, చంద్రబాబునాయుడుతో పాటు వందలాదిమంది టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారని ఆయన గుర్తుచేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను అప్పట్లో నడిరోడ్డుపై కూర్చోపెట్టారని, విశాఖలో జనసైనికులపైనా రాళ్లు వేయించారని, యువగళం పాదయాత్రలో లోకేష్‌బాబును చిత్రహింసలు పెట్టారని ఆయన జగన్‌పై ధ్వజమెత్తారు. అంతేకాదు, సొంత పార్టీ ఎంపీలను సైతం వదిలి పెట్టకుండా జగన్ కక్షసాధింపులకు పాల్పడ్డాడన్నారు. ఎంపీ రఘురామ కృష్ణరాజుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి, వీడియో కాల్‌లో చూసి పైశాచిక ఆనందం పొందాడని, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిపై గ్రావెల్ దొంగతనం కేసు పెట్టించారని ఆయన అన్నారు. ఒకవైపు ఇతరుల ప్రాణాలు తీస్తూ, తన ప్రాణాలకు రక్షణ లేదనడం విడ్డూరమన్నారు. రాష్ట్రం సజావుగా నడవడం, అభివృద్ధి చెందడం జగన్‌రెడ్డికి ఇష్టం లేదని.. అందుకే ఇలాంటి రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com